రాయలసీమను సస్యశ్యామలం చేయడానికి బనకచర్లకు గోదావరి జలాలు తెస్తామని ప్రభుత్వం అంటోంది. రూ.80 వేల కోట్లతో ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేస్తోంది. ఎక్కడి నుంచో కరువు సీమకు నీళ్లు ఇస్తా అనడం సరే.. హక్కుగా కృష్ణా నది నుంచి రావాల్సిన నీరు ముందు ఇవ్వాలి. ఇందులో భాగంగా ఉమ్మడి కర్నూలు జిల్లా జీవనాడి గుండ్రేవుల ప్రాజెక్టును ప్రథమ ప్రాధాన్యతగా చేపట్టి పూర్తి చేయాలి. హంద్రీనీవా కాలువకు కృష్ణా జలాలు విడుదల చేసేందుకు నేడు ఉమ్మడి కర్నూలు జిల్లాకు వస్తున్న సీఎం చంద్రబాబు దృష్టికి గుండ్రేవుల ప్రాజెక్టు అవసరాన్ని మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు తీసుకువెళ్లాలని ప్రజలు కోరుతున్నారు. ఈ వివరాలపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.



తుంగభద్ర నదిపై గుండ్రేవుల జలాశయం నిర్మాణం కోసం ప్రతిపాదించిన ప్రదేశం

గుండ్రేవుల పూర్తి చేస్తారా..?

- కరువు, వలసలు నివారించే బృహత్తర ప్రాజెక్టు
- 2019లో రూ.1,985 కోట్లు మంజూరు చేసిన టీడీపీ ప్రభుత్వం
- వైసీపీ హయాంలో ఐదేళ్లు నిర్లక్ష్యం
- వేదవతి, ఆర్డీఎస్ కుడి కాలువ, రాయలసీమ లిఫ్ట్‌ను ఓకే చేసిన ప్రస్తుత ప్రభుత్వం
- నేడు హంద్రీ-నీవాకు కృష్ణా జలాలు విడుదల చేయనున్న సీఎం చంద్రబాబు

కర్నూలు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కర్నూలు-కడప (కేసీ) కాలువ పరిధిలో కర్నూలు, నంద్యాల, కడప జిల్లాల్లో 2,65,628 ఎకరాల ఆయకట్టు ఉంది. 31.90 టీఎంసీలు నికర జలాలు కేటాయింపు ఉన్నా నిల్వ చేసుకునే జలాశయం లేదు. తుంగభద్ర డ్యాం నుంచి 10 టీఎంసీలు, సుంకేసుల బ్యారేజీ నుంచి తుంగభద్ర ప్రవాహం ద్వారా 21.90 టీఎంసీలు మళ్లించాలి. ఈ బ్యారేజీ సామర్థ్యం కేవలం 1.20 టీఎంసీలే. తుంగభద్రకు వరద రోజులు తగ్గడం, టీబీ డ్యాం నుంచి ఇచ్చే వాటా జలాలు నదిలో దాదాపు 350 కిలోమీటర్లు ప్రవహించి సుంకేసుల బ్యారేజీకి 25 శాతం కూడా చేరడం లేదు. దీంతో కేసీ కాలువ చివరి ఆయకట్టు, కర్నూలు నగరానికి సాగు, తాగునీటి కష్టాలు తప్పడం లేదు. ఈ కష్టాలకు చెక్ పెట్టి.. కష్టజీవుల కన్నీళ్లు తుడవాలంటే సుంకేసుల ఎగువన 20 టీఎంసీల సామర్థ్యంతో గుండ్రేవుల జలాశయం నిర్మాణమే ఏకైక మార్గమని సాగునీటి నిపుణుడు, రిటైర్డ్ ఈఈ సుబ్బరాయుడు గుండ్రేవుల ప్రాజెక్టుకు డిజైన్ చేశారు. గత టీడీపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు గురించి ఎన్నికల ముందు పట్టించుకుంది. 2019 ఫిబ్రవరి 21న ప్రస్తుత డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి కోరిక మేరకు రూ.2,890 కోట్లు మంజూరు చేస్తూ జీవో ఆర్‌టీ నం.154 జారీ చేసింది. అప్పటి కల్లా పుణ్యకాలం ముగిసి ఎన్నికలు రావడం, టీడీపీ ఓడిపోవడం, జగన్ ప్రభుత్వం అధికారంలోకి రావడం వెంట వెంటనే జరిగాయి. వైసీపీ ప్రభుత్వం గుండ్రేవులను అంతర్రాష్ట్ర సమస్య అంటూ అటకెక్కించింది. మళ్లీ సీఎం చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం రాకతో రైతుల్లో గుండ్రేవులపై ఆశలు చిగురించాయి. ఈ ప్రాజెక్టు డీపీఆర్‌ను కేఆర్ఎంబీ సహా కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు పంపించారు. 35 టీఎంసీలకు పెంచి, అందులో 15 టీఎంసీలు ఆర్డీఎస్ ఎడమ కాలువ ఆయకట్టుకు ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించినట్లు తెలుస్తున్నది. అంటే ఇప్పుడు గుండ్రేవులకు ఏ ఆటంకం లేనట్లే. మరి పదవీ కాలం ఆరంభం నుంచే ఈ ప్రాజెక్టు మీద కేంద్రీకరిస్తే ఉమ్మడి జిల్లా ప్రజల కలలు నెరవేరుతాయి. మరి ఆ దిశగా ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు టీజీ భరత్, ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్దన్‌రెడ్డి, ఎంపీలు బస్తిపాటి నాగరాజు, బైరెడ్డి శబరి సహా ఎమ్మెల్యేలు సీఎం చంద్రబాబును ఒప్పించగలరా?

మిగతా 6వ పేజీలో

సీఎం పర్యటన ఇలా..

నంద్యాల/నందికొట్కూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు గురువారం ఉదయం 9.30 గంటలకు ఢిల్లీలోని జన్‌పథ్ నుంచి బయలుదేరి 10 గంటలకు ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుంటారు. ఢిల్లీలో ఉదయం10.10 గంటలకు బయలుదేరి 12.25 గంటలకు కర్నూలు విమానాశ్రయానికి చేరుకుంటారు. మధ్యాహ్నం 12.35 గంటలకు బయలుదేరి 12.45 గంటలకు నందికొట్కూరు మండలం అల్లూరు గ్రామంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు వస్తారు. 12.45 నుంచి 12.50 గంటల వరకు హెలిప్యాడ్ వద్ద ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారు. 12.50 గంటలకు హెలిప్యాడ్ నుంచి రోడ్డు మార్గం ద్వారా 1.00 గంటకు మల్యాలలోని హెచ్ఎన్ఎస్ఎస్ పంపింగ్ స్టేషన్-1 వద్దకు చేరుకుంటారు. 1 గంట నుంచి 1.45 గంటల వరకు కృష్ణమ్మకు జలహారతి కార్యక్రమంలో పాల్గొంటారు. 1.45 నుంచి 2.15 భోజన విరామం తీసుకుంటారు. 2.15 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 2.30 గంటల నుంచి 3.30 గంటల వరకు మల్యాల క్రాస్ వద్ద ఏర్పాటు చేసిన నీటి సహాయక సంఘాలు, రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొంటారు. 3.35 గంటలకు హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. 3.50 గంటలకు కర్నూలు విమానాశ్రయానికి చేరుకుంటారు. 4.45 గంటలకు విజయవాడకు చేరుకుంటారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యేలు, జలవనరుల శాఖామంత్రి నిమ్మల రామానాయుడు, అధికారులు పాల్గొంటారు.

ఓర్వకల్లు విమానాశ్రయంలో భద్రత ఏర్పాట్లు

ఓర్వకల్లు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గురువారం ఓర్వకల్లు విమానాశ్రయానికి రానున్న సందర్భంగా అక్కడ పటిష్ట భద్రత ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ పి.రంజిత్ బాషా, ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. బుధ వారం కలెక్టర్, ఎస్పీలు ఓర్వకల్లు విమానాశ్రయంలో భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. సీఎం చంద్రబాబు నాయుడు ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో 12.25 గంటలకు ఓర్వకల్లు ఎయిర్‌పోర్టుకు చేరుకుని ఇక్కడి నుంచి మల్యాలకు ప్రత్యేక హెలికాప్టర్‌లో 12.45 గంటలకు బయలుదేరి వెళుతారన్నారు. అక్కడ పర్యటనను ముగించుకుని ఓర్వకల్లు ఎయిర్‌పోర్టుకు మధ్యాహ్నం 3.50గంటలకు చేరుకుని ప్రత్యేక విమానంలో సాయంత్రం 4.40గంటలకు విజయవాడకు బయలుదేరనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎయిర్‌పోర్టు డైరెక్టర్ విద్యా సాగర్, కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, కర్నూలు డీఎస్పీలు బాబు ప్రసాద్, భాస్కర్‌రావు, స్పెషల్ బ్రాంచ్ సీఐ తేజమూర్తి తదితరులు పాల్గొన్నారు.



ఓర్వకల్లు ఎయిర్‌పోర్టులో భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ పి.రంజిత్ బాషా, ఎస్పీ విక్రాంత్ పాటిల్

పలుగు, పార పట్టిన భావి భారతం



నేటి విద్యార్థులే రేపటి భావిభారత పౌరులు. పాఠశాలకు వెళ్లి చదువుకోవాల్సిన విద్యార్థులు పలుగు పార పట్టి పనులు చేస్తున్నారు. వర్కూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో కొంతమంది విద్యార్థులు బుధవారం ఇలా కనిపించారు. పాఠశాల మైదానంలో కూరగాయల తోట పెంచడానికి గడ్డపార, పికాస, పారతో గట్టినేలను పెకిలించి చదును చేశారు. వారం రోజుల క్రితం నుంచి విద్యార్థులతో కూరగాయల తోటకు సంబంధించిన పనులు చేయిస్తున్నట్లు తెలిసింది.

● కోడుమూరు రూరల్, ఆంధ్రజ్యోతి

చెక్క రథంపై ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, జూలై 16(ఆంధ్రజ్యోతి) : మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు చెక్క రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. బుధవారం ఆషాఢ మాస షష్ఠి కర్కాటక సంక్రమణలో భాగంగా ఉదయం జరగాల్సిన ప్రత్యేక పూజలు మధ్యాహ్నం 12.20 గంటల నుంచి రాఘవరాయడికి అభిషేకాలు ప్రారంభమయ్యాయి. శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో మూలరాములకు కనకాభిషేకం చేసి హస్తోదకం చేశారు. ప్రహ్లాదరాయల పాదపూజ అనంతరం పల్లకిలో ఊరేగించారు. చెక్క రథాన్ని వివిధ పుష్పాలతో అలంకరించి, వేద పండితుల మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాల మధ్య వజ్రాలు పొదిగిన ప్రహ్లాదరాయలను అధిష్టించి ఊరేగించారు. అనంతరం ఊంజల సేవ నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి వేలాదిగా తరలి వచ్చిన భక్తులతో మంత్రాలయం మార్మోగింది.



చెక్క రథంపై విహరిస్తున్న ప్రహ్లాదరాయలు

మధ్యవర్తిత్వంతోనే కేసులు పరిష్కారం

- జిల్లా ప్రధాన న్యాయాధికారి కబర్ది
- న్యాయసేవా సదన్ నుంచి కొండారెడ్డి బురుజు వరకు ర్యాలీ
- పాల్గొన్న న్యాయాధికారులు, న్యాయవాదులు



1కే ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ది

కర్నూలు లీగల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వంతో కేసులు సత్వరం పరిష్కారం అవుతాయని జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ది పేర్కొన్నారు. బుధవారం స్థానిక న్యాయ సేవా సదన్ భవన్‌లో 'మధ్యవర్తిత్వం - దేశం కోసం' అనే అంశం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా మధ్యవర్తిత్వంపై పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని అన్నారు. ప్రజలకు మధ్యవర్తిత్వంతో కలిగే లాభాలను వివరించినట్లు తెలిపారు. కక్షిదారులు తమ వివాదాలను ఈ మధ్యవర్తిత్వంతో పరిష్కరించుకుంటే వ్యయ ప్రయాసలకు లోను కాకుండా ఎలాంటి ఖర్చులు లేకుండా సత్వర న్యాయం పొందవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక న్యాయ సేవాసదన్ భవనం నుంచి మున్సిఫ్ కోర్టు మీదుగా కొండారెడ్డి బురుజు వరకు జరిగిన 1కే ర్యాలీని పచ్చజెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో శాశ్వత లోక్‌అదాలత్ చైర్మన్ ఎం.వెంకట హరినాథ్, సీనియర్ సివిల్ న్యాయాధికారి దివాకర్‌లతో పాటు పలువురు న్యాయాధికారులు, న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

20న కర్నూలు ఐఐఐటీ డీఎం స్నాతకోత్సవం

- ఇస్రో చైర్మన్ నారాయణన్ రాక

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జగన్నాథగట్టుపై ఉన్న ట్రిపుల్ ఐటీ డీఎంలో ఈనెల 20వ తేదీన ఉదయం 11గంటలకు కృష్ణా సెమినార్‌లో 7వ స్నాతకోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు కర్నూలు డైరెక్టర్ ప్రొ. బీఎస్ మూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఇస్రో చైర్మన్ డా.వి. నారాయణన్, ఐఐఐటీడీఎం బోర్డు ఆఫ్ డైరెక్టర్ పద్మశ్రీ ప్రొ. దేశ్‌మాన్ విజయలక్ష్మి హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

పాఠశాలలను బలోపేతం చేయాలి


- డీఈవో శామ్యూల్‌పాల్

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలను పాఠశాలల యాజమాన్య కమిటీ సభ్యులతో మమేకమై బలోపేతం చేయాలని డీఈవో శామ్యూల్‌పాల్ తెలిపారు. బుధవారం స్థానిక శ్రీలక్ష్మి శ్రీనివాస బీఎడ్ కళాశాలలో ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల తరగతుల శిక్షణా కార్యక్రమానికి హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల తరగతుల పర్యవేక్షణ, విద్యా కార్యకలాపాలు, పాఠశాలల యాజమాన్య కమిటీ సభ్యులతో మంచి సంబంధాలు కలిగి ఉండి పాఠశాలల అభివృద్ధికి తోడ్పడాలన్నారు. అభ్యాసక ఫలితాలు మౌలిక సదుపాయాలు, నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులను ప్రోత్సహించడం, ఉత్తమ బోధన పద్ధతులను కనుగొనడం, నెమ్మదిగా నేర్చుకునే వారికి సహకరించాలని తెలిపారు. కార్యక్రమంలో సెక్టోరియల్ ఆఫీసర్లు, మాస్టర్ ఫెసిలిటేటర్లు, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీశైలం జలాశయానికి వరద

- 881.80అడుగులకు చేరిన నీటిమట్టం
- నీటి లభ్యత 197.91 టీఎంసీలు
- 68,338 క్యూసెక్కులు సాగర్‌కు విడుదల



నంద్యాల, జూలై16 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి వరద కొనసాగుతోంది. జూరాల నుంచి 36,613 క్యూసెక్కులు, సుంకేసుల జలాశయం నుంచి 16,688 క్యూసెక్కుల వరద శ్రీశైలం జలాశయానికి వచ్చి చేరుతోంది. దీంతో శ్రీశైలం కుడి, ఎడమ విద్యుత్ ఉత్పాదన కింద 68,338 క్యూసెక్కుల నీటిని నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయంలో బుధవారం సాయంత్రానికి నీటి మట్టం 885.00 అడుగులు ఉండగా.. 881.80 అడగులకు చేరింది. నీటి సామర్థ్యం 215.80 టీఎంసీలు కాగా నీటి లభ్యత 197.91 టీఎంసీలుగా నమోదైంది.

పెరిగిన పత్తి ధర

- క్వింటం గరిష్ఠంగా రూ.8269



ఆదోని మార్కెట్ యార్డుకు విక్రయానికి వచ్చిన పత్తి దిగుబడి

ఆదోని అగ్రికల్చర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో పత్తి ధరలు పుంజుకున్నాయి. బుధవారం పత్తి ధర గరిష్ఠంగా క్వింటాళ్ల రూ.8269 పలికింది. ఖరీఫ్ సీజన్ ఆరంభంలో మళ్లీ ధరలు పెరుగుతుండడంతో పత్తి రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నెల రోజులతో పోల్చితే క్వింటానికి గరిష్ఠంగా రూ.200పైగా ధర పెరిగింది. 117 క్వింటాలు విక్రయానికి రాగా వాటి కనిష్ఠ ధర రూ.5216, గరిష్ఠ ధర రూ. 8269, మధ్య ధర రూ. 8080 పలికింది.

విశాఖ తరహాలో నగరాన్ని తీర్చిదిద్దుదాం

- అభివృద్ధి పనుల్లో కాలయాపన తగదు
- నాణ్యతా ప్రమాణాలను తప్పక పాటించాలి
- పార్కుల అభివృద్ధిపై దృష్టి సారించాలి
- సచివాలయాలను వేరే చోటికి తరలించండి
- పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్
- మున్సిపల్ అధికారులతో సమీక్ష



మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్, హాజరైన అధికారులు

కర్నూలు న్యూసిటీ, జూలై 16(ఆంధ్రజ్యోతి): విశాఖపట్టణం తరహాలో కర్నూలు నగరాన్ని తీర్చిదిద్దేందుకు అధికారులందరూ కలిసికట్టుగా పనిచేయాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. బుధవారం ప్రభుత్వ అతిథిగృహంలో మున్సిపల్ అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన కమిషనర్ పి. విశ్వనాథ్‌పై ఉన్నతాధికారుల్లో మంచి అభిప్రాయం ఉందని, పనితీరు బాగుంటుందని మంత్రి కితాబునిచ్చారు. నగరాన్ని ఆధునిక హంగులతో తీర్చిదిద్ది 'న్యూ లుక్' తేవాలని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కాలం పూర్తి అయిందని, ఒక మిగిలిన మూడున్నరేళ్లలో అభివృద్ధి పనులను పూర్తిచేయడంలో ఎలాంటి కాలయాపన చేయరాదని స్పష్టంచేశారు. గత సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాల పురోగతిపై మంత్రి ఆరాతీశారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, పనులు పటిష్ఠంగా ఉండేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాజ్‌విహార్ సమీపంలోని ఎల్లమ్మ గుడి నుంచి జమ్మిచెట్టు వరకు హంద్రీనది ఒడ్డున నిర్మిస్తున్న రహదారి పనులను వేగవంతం చేయాలన్నారు. ఆస్తిపన్ను, ట్రేడ్ లైసెన్సు రుసుముల మొండి బకాయిల వసూళ్లకు ప్రత్యేక యాక్షన్ ప్లాన్ అమలు చేయాలన్నారు. పార్కుల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించాలని, ఆగస్టు ఆఖరు నాటికి పార్కుల్లో మరమ్మతులు పూర్తిచేయాలని ఆదేశించారు. రహదారులపై ఎక్కడ గుంతలు పడకుండా ఎప్పటికప్పుడు పూడ్చడానికి చర్యలు తీసుకోవాలన్నారు. డిసెంబర్ నాటికి 30వేల మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కమ్యూనిటీ హాల్స్‌లో ఉన్న సచివాలయాలను ఖాళీచేసి వాటిని పైకి తరలించడం, లేదంటే మరో చోటికి మార్చే ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ సతీష్‌రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డా.కే.విశ్వేశ్వరరెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఇన్‌చార్జి ఎస్ఈ శేషసాయి, ఆర్‌వో జునైద్, టిడ్కో అధికారి పెంచలయ్య, టీపీఆర్‌వో వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

31లోపు బంగారు కుటుంబాల దత్తత పూర్తికావాలి

- ఇప్పటి వరకు 64,128 బంగారు కుటుంబాల గుర్తింపు
- మార్గదర్శులను గుర్తించేందుకు గ్రామ కమిటీలు
- కలెక్టర్ రంజిత్ బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఈ నెల 31వ తేదీ లోపు బంగారు కుటుంబాల దత్తత పూర్తి కావాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో నియోజకవర్గ స్పెషల్ అధికారులు, ఎంపీడీవోలు, డిస్ట్రిక్ట్ విజన్ ప్లాన్ యూనిట్, నియోజకవర్గ విజన్ ప్లాన్ యూనిట్ సభ్యులతో జీరో పావర్టీ పీ-4 పాలసీ అమలుపై కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీరో పావర్టీ పీ-4 పాలసీ అమలులో భాగంగా జిల్లాలో 64,128 బంగారు కుటుంబాలను గుర్తించామన్నారు. గ్రామాలు, వార్డుల్లో ఈ నెల 15 నుంచి 25వ తేదీ వరకు గ్రామసభలను నిర్వహించడం జరుగుతోందని, గ్రామసభల్లో ఈ బంగారు కుటుంబాల జాబితాను మరోసారి పరిశీలించి అర్హులైన వారితో తుది జాబితాను తయారు చేయాలన్నారు. ఈ నెల 31వ తేదీ నాటికి తుది జాబితాలో ఉన్న బంగారు కుటుంబాలను మార్గదర్శులను గుర్తించేందుకు గ్రామ కమిటీలు వేయాలని సూచించారు. గ్రామానికి ఒక అధికారిని ఇన్‌చార్జిగా నియమించాలన్నారు. ప్రైవేటు స్కూల్స్ మేనేజ్‌మెంట్స్, ఇండస్ట్రీస్, డాక్టర్స్, తదితరులను భాగస్వాములను చేయాలని అధికారులను ఆదేశించారు.

సీఎం పర్యటన జయప్రదం చేయాలి

టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

కర్నూలు అర్బన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయుడు గురువారం ఉమ్మడి జిల్లా పర్యటనను జయప్రదం చేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. బుధవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గురువారం మధ్యాహ్నం 1 గంటలకు నందికొట్కూరు నియోజకవర్గంలోని మల్యాల గ్రామ సమీపంలో రూ.3800కోట్లతో హెచ్ఎన్ ఎస్ఎస్ (హంద్రీ నీవా)ఆధునికీకరణ పనులు చేపట్టిన తర్వాత నీటి విడు దల చేస్తారన్నారు. ఆతర్వాత జలహారతి, 2.30గంటలకు బహిరంగ సభ ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లాల ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గం, మండల స్థాయి కమిటీల నాయకులు, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు, డైరెక్టర్లు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

ప్రత్యేక ఇరిగేషన్ కమిటీ ఏర్పాటు చేయాలి

- సీఎం ప్రకటనను స్వాగతిస్తాం
- రాయలసీమ సాగునీటి సాధన సమితి నాయకుడు

బొజ్జా దశరథరామిరెడ్డి



నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): రాయలసీమ అభివృద్ధి చెందాలంటే ప్రత్యేక ఇరిగేషన్ కమిటీ ఏర్పాటుచేయాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి నాయకుడు బొజ్జా దశరథరామిరెడ్డి అన్నారు. నంద్యాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం చంద్రబాబునాయుడు రాయలసీమ సాగునీటి రంగ అభివృద్ధే లక్ష్యమని ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. హంద్రీనీవా ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తిచేసి అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని ఆశిస్తున్నామన్నారు. రాష్ట్ర విభజన హక్కు చట్టం ద్వారా రాయలసీమలో 21లక్షల ఎకరాల ఆయకట్టుకు కృష్ణాజలాల లభ్యత ఉన్నప్ప టికీ నేడు ఎనిమిది లక్షల ఆయకట్టుకు మాత్రమే నీరు పొందుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రాయలసీమలో ఉన్న వ్యవసాయ యోగ్యమైన భూమి ఉన్నప్పటికీ కేవలం 8.8 శాతం ఆయకట్టుకు మాత్రమే నీళ్లు లభిస్తున్నాయన్నారు. ఇంత తక్కువ శాతం సాగు నీరు లభిస్తున్న ప్రాంతం రాష్ట్రంలో ఎక్కడా లేదన్నారు. తుంగబద్ర ఎగువ సమాంతర కాల్వ, గుండ్రేవుల రిజర్వాయర్, వేదవతి ఎత్తిపోతల పథకం, సిద్ధేశ్వరం అలుగు తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని సమగ్రంగా కార్యాచరణ రూపొందిస్తే రాయలసీమ సస్యశ్యామలం అవుతుందన్నారు. రాయలసీమ సాగునీటి రంగ అభివృద్ధికి సీఎం యుద్ధప్రాతిపదికన కార్యాచరణ చేపట్టాలని కోరారు.

చదువుకు సాయం

- పేద విద్యార్థులకు రవాణా భత్యం
- పకడ్బందీగా విద్యాహక్కు చట్టం అమలు



హాలహర్వి, జూలై16(ఆంధ్రజ్యోతి): పేద పిల్లలు ఏ కారణంతోనూ చదువు ఆపకూడదని, వారికి నాణ్యమైన విద్య అందించాలని కూటమి ప్రభుత్వం దృఢ నిశ్చయంతో ఉంది. దీనికి అనేక సంస్కరణలు చేపట్టింది. ప్రస్తుతం ప్రతి విద్యార్థికి తల్లికి వందనం పేరుతో తల్లుల ఖాతాలో నిధులు జమ చేసింది. మధ్యాహ్న భోజనం కోసం సన్న బియ్యాన్ని అందిస్తోంది. కొత్తగా దూరప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు మరో పథకానికి శ్రీకారం చుట్టింది. విద్యాహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయడానికి బస్సు సౌకర్యంలేని గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులకు రవాణా భత్యం అందించాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నిర్ణయం తీసుకున్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి విద్యార్థి ఖాతాలో రవాణా భత్యం చెల్లించాలని ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో విద్యార్థి తల్లిదండ్రులకు ఆర్థిక భారం తగ్గుతుంది.

చదువు కోసం అవస్థలు

జిల్లాలోని ఆదోని, ఆలూరు, మంత్రాలయం, పత్తికొండ నియోజకవర్గాల్లో ఎర్రబస్సు ఎరుగని గ్రామాలు ఎన్నో ఉన్నాయి. రోడ్లు లేక, బస్సులు రాక అనేక మంది విద్యార్థులు మధ్యలోనే చదువు ఆపేస్తున్నారు. ఇందులో కొంతమంది తల్లిదండ్రులు భారమైనా ఆటోలు ఏర్పాటు చేసి పిల్లలను చదివించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పేద విద్యార్థుల చదువుకు సాయం అందించేందుకు రవాణా భత్యం ప్రభుత్వమే ప్రతి మూడు నెలలకోసారి అందించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఉన్నతాధికారులను ఆదేశించారు.

పథకం అమలు ఇలా

పేద పిల్లల చదువులు అర్ధాంతరంగా ఆగిపోకుండా ఉండేందుకు రవాణాభత్యం చెల్లించాలని విద్యాహక్కు చట్టంలో పొందుపరిచారు. ప్రభుత్వం ఈ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయడానికి సిద్ధమైంది. రవాణాభత్యాన్ని కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం అందించాలి. ప్రాథమిక పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఇంటి నుంచి కి.మీ. నుంచి మూడు కి.మీ. దూరంలో ఉన్న 6 నుంచి 8వ తరగతి విద్యార్థులు ఇంటి నుంచి మూడు కి.మీ. పైనున్న వారికి రూ.600 చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ భత్యాన్ని మూడు నెలలకు ఓసారి తల్లిదండ్రుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తుంది. యేడాదికొకసారి చెల్లిస్తే తల్లిదండ్రులకు ఇబ్బందిగా మారే అవకాశం ఉందని మూడు నెలలకోసారి చెల్లిస్తే వెసులుబాటు కలుగుతుందని ప్రభుత్వం భావించింది. ఈ పథకం వల్ల జిల్లాలో 80 వేల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది.



చదువు కోసం కాలిబాట పడుతున్న విద్యార్థులు

మంచి నిర్ణయం



మా గ్రామంలో 6 నుంచి 8వ తరగతి చదివే విద్యార్థులు 50 మంది రోజూ బడికి నడిచి వెళ్తున్నారు. వారి కష్టాన్ని చూడలేక మేమే ఆటోలను ఏర్పాటు చేసి నెలనెలా వారికి డబ్బులు చెల్లిస్తున్నాం. ఇప్పటి నుంచి ఆ ఖర్చు ప్రభుత్వమే భరిస్తుందని తెలియడంతో సంతోషంగా ఉంది.

- మల్లికార్జున, పచ్చారపల్లి గ్రామం

మారుమూల పల్లెలకు వరం



హాలహర్వి మండలంలో అనేక మారుమూల పల్లెలకు బస్సు సౌకర్యాలు లేవు. ఆ పిల్లల చదువులు అర్ధాంతరంగా ఆగిపోతున్నాయి. ప్రభుత్వం రవాణా భత్యం చెల్లించేలా తీసుకున్న నిర్ణయం పేద పిల్లలకు వరంగా మారింది.

- ఉమాకాంత్‌స్వామి, చింతకుంట గ్రామం

అందరికీ అందేలా చూస్తాం




దూర ప్రాంతాల నుంచి వచ్చి చదువుకునే పిల్లలందరికీ రవాణా భత్యం అందేలా చర్యలు తీసుకుంటాం. ఈ యేడాది పకడ్బందీగా ప్రతి తల్లిదండ్రుల ఖాతాలో నిధులు జమ అయ్యేలా చూస్తాం.

- ఈరన్న, ఎంఈవో, హాలహర్వి మండలం

సీఎం సారూ.. ఆలయాలపై దృష్టి సారించరూ..!

- నల్లమలలో కొలువైన రాష్ట్రంలోనే ఏకైక సరస్వతీ ఆలయం
- కృష్ణాతీరంలో వెలసిన చారిత్రాత్మక సంగమేశ్వరాలయం



కొలనుభారతి క్షేత్రం

ఆత్మకూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలోని రెండు ప్రసిద్ధ ఆలయాలు సీఎం సారూ.. దృష్టి సారించాలని భక్తులు వేడుకుంటున్నారు. నందికొట్కూరు నియోజకవర్గం లోని కొత్తపల్లి మండలంలో ఈ ఆలయాలు వెలిశాయి. ఆంధ్రప్రదేశ్‌లోనే ఏకైక సరస్వతీ ఆలయంగా విరాజిల్లుతున్న కొలనుభారతి క్షేత్రం ఒకటి. మరొకటి సప్తనదుల సంగమ ప్రదేశంలో వెలసిన సంగమేశ్వర క్షేత్రం. ఈ రెండు క్షేత్రాలు ఆధ్యాత్మికంగా ఎన్నో విశేషా లను సొంతం చేసుకున్నప్పటికీ అభివృద్ధిలో మాత్రం అన్నివిధాలుగా నిరాదరణకు గురయ్యాయి. గతంలో టీడీపీ హయాంలోనే ఈ క్షేత్రాల అభివృద్ధిపై అడుగు పడినప్పటికీ ఆతర్వాత వైసీపీ అధికారంలోకి రావడంతో పరిస్థితి అధ్వానంగా మారింది. గురువారం నందికొట్కూరు నియోజకవర్గంలోని మల్యాల ఎత్తిపోతల వద్దకు సీఎం చంద్రబాబు రానుండటంతో ఈ క్షేత్రాలపై అభివృద్ధిపై దృష్టి సారించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

దేశంలోనే ప్రసిద్ధి..

కొలనుభారతి క్షేత్రం దేశంలోనే ఎంతో ప్రసిద్ధిగాంచింది. నల్లమల పర్వత సానుల నడుమ 11వ శతాబ్దానికి ముందే ఈ క్షేత్రం ఆవిర్భవించినట్లు ప్రాచీన చరిత్ర ద్వారా తెలుస్తోంది. అప్పట్లోనే క్షేత్రంలో సప్తరుషులచే సప్తశివాలయాలను కూడా నిర్మించి ఆయా శివాలయాల్లో శివలింగాలను ప్రతిష్ఠించారు. క్షేత్రంలో సహజసిద్ధంగా ఏర్పడిన చారుఘోషిని తీర్థం నిరంతరం జీవనదిలో ప్రవహిస్తుంది. ఈక్షేత్రానికి ఏటా పెరుగుతున్న భక్తుల రద్దీ దృష్ట్యా ప్రభుత్వం సదుపాయాలను కల్పిస్తే రాష్ట్రానికే కొలనుభారతి క్షేత్రం తలమానికంగా నిలువనుంది.

సప్తనదులు సంగమించే దివ్యధామం

కృష్ణ, వేణి, తుంగ, భద్ర, మలాపహరణి, భీమరతి, భవనాశి అనే ఏడు నదులు సంగమించే దివ్యధామం సప్తనదీ సంగమేశ్వర క్షేత్రం. ద్వాపరయుగంలో పంచపాండవులు అరణ్యవాసం చేసిన సమయంలో ఇక్కడ వేపదారు శివలింగాన్ని ప్రతిష్ఠించినట్లు పురాణా ల ద్వారా తెలుస్తోంది. శ్రీశైల జలాశయ నిర్మాణం పూర్తయిన తర్వాత 1980లో సప్తనదీ సంగమేశ్వరం కృష్ణమ్మ గర్భంలోకి చేరుకుంది. అప్పటి నుంచి 24ఏళ్ల పాటు జలాధివాసమైన సంగమేశ్వరుడు మొట్టమొదటి సారిగా 2003లో బయటపడి భక్తులచే పూజందుకుంటున్నాడు. ఆతర్వాత నుంచి 8మాసాలు జలాధివాసమై నాలుగు మాసాలు మాత్రమే భక్తులచే పూజలందుకుంటారు. కృష్ణా పుష్కరాల సమయంలో రూ.90లక్షల సీజీఎఫ్ నిధు లతో జీర్ణోద్ధరణ పను లను ప్రారంభించినప్పటికీ నిధుల సరిపోక పనులు మధ్యలోనే నిలిచిపోయాయి.



సంగమేశ్వరాలయం

వాసవి సత్రాల నిర్వహణకు దాతలే దేవుళ్లు

- రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్
- త్వరలో తిరుపతి, విజయవాడలోనూ అన్న సత్రాలు
- వాసవి సంస్థ ప్రధాన కార్యదర్శి ఇల్లూరు లక్ష్మయ్య



మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్‌తో వాసవి సత్రాల నిర్వాహక ప్రతినిధులు

కర్నూలు కల్చరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): వాసవి సత్రాల నిర్వహణకు దాతలు మనకు దేవుళ్లు అని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. బుధవారం కర్నూలులో జరిగిన వాసవి సత్ర సముదాయాల నిర్వాహక ప్రతినిధులతో టీజీ వెంకటేశ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతలతో పాటు సామాన్య భక్తులకు కూడా మంచి సౌకర్యాలు కల్పించాలన్నారు. వాసవి సత్రాల సంస్థ అధ్యక్షుడు దేవకి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ నెలలోనే తిరుపతిలోనూ, విజయవాడలోనూ వాసవి అన్న సత్రాలు ప్రారంభమవుతారని తెలిపారు. సంస్థ ప్రధాన కార్యదర్శి ఇల్లూరు లక్ష్మయ్య మాట్లాడుతూ భవిష్యత్తులో అరుణాచలం, అయోధ్య, మంత్రాలయం, యాదగిరి గుట్టలలో తమ సంస్థలు ఏర్పాటుకు స్థలాలను పరిశీలిస్తున్నామని తెలిపారు. పంగులూరు సీతమ్మ డెవలప్‌మెంట్ అసోసియేషన్ తరఫున తిరుపతిలో రూ.40 కోట్లు విలువ చేసే స్థలం వాసవి సంస్థకు 30 ఏళ్లకు ఎంఓయూ రిజిస్టర్ డాక్యుమెంటేషన్ అందజేయడం జరిగిందని తెలిపారు. అది పూర్తయితే తిరుపతికి వచ్చే యాత్రికులకు వసతి, అన్నదానం ఏర్పాటు చేస్తామని తెలిపారు. సభ్యు లంతా టీజీ వెంకటేశ్‌ను శాలువ, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించారు.

గుండ్రేవుల పూర్తి చేస్తారా?



పత్తికొండ రిజర్వాయర్ కుడి కాలువ

(5వ పేజీ తరువాయి)

జిల్లా రైతాంగం మీద తమకు ప్రేమ, బాధ్యత ఉన్నాయని నిరూపించుకోగలరా? జిల్లా ఇన్‌చార్జి మంత్రి అయిన జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడులపై ఒత్తిడి తేగలరా? 2019 ఎన్నికల ముందు హడావిడిగా వేసిన శిలాఫలకం చేసిన సీఎం చంద్రబాబు ఇప్పుడు పనులు చేపట్టగలరా? ఈ విడత అయినా గుండ్రేవులను పూర్తి చేస్తారా? అని రైతులు ప్రశ్నలు సంధిస్తున్నారు.

ఆ ప్రాజెక్టులు తక్షణం చేపట్టాలి

ఆలూరు, ఆదోని నియోజకవర్గాల్లో 80 వేల ఎకరాలకు సాగునీరు, 196 గ్రామాలకు తాగునీరు అందించాలనే లక్ష్యంగా వేదవతి ఎత్తిపోత పథకం ప్రాజెక్టును 2019 జనవరి 29న రూ.1,942.80 కోట్లు మంజూరు చేసి జీవో.ఆర్‌టీ.నెం.77 జారీ చేశారు. రూ.106.2 కోట్లు (6.61 శాతం) పనులు చేశారు. మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గంలో 40 వేల ఎకరాలకు సాగునీరు అందించాలనే ఆశయంగా ఆర్డీఎస్ కుడి కాలువ నిర్మాణానికి రూ.1,985.42 కోట్లు మంజూరు చేస్తూ 2019 జనవరి 20న జీవో ఆర్‌టీ నెం.76 జారీ టెండర్లు హెడ్ వర్క్ పనులు, కాలువ నిర్మాణం రూ.11.90 కోట్లు విలువ పనులు (0.73 శాతం) మాత్రమే చేశారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. ఐదేళ్ల నిర్లక్ష్యం వెంటాడింది. వైసీపీ హయాంలో రాయలసీమ దుర్భిక్ష నివారణ మిషన్ (ఆర్‌డీఎంపీ)లో భాగంగా రాయలసీమ ఎత్తిపోతల పథకం చేపట్టారు. సంగమేశ్వరం నుంచి రోజుకు 3 టీఎంసీలు ఎత్తిపోసి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ దిగువన ఎస్ఆర్ఎంసీలో వేయాలనే లక్ష్యంతో రూ.2020 మే 5న రూ.3,825 కోట్లు మంజూరు చేస్తూ జీవో ఆర్టీ నంబరు 203 జారీ చేశారు. 2021 ఫిబ్రవరిలో పనులు మొదలు పెట్టి రూ.745.46 కోట్లు (22.54 శాతం) విలువైన పనులు చేశారు. తాజాగా ఈ ప్రాజెక్టులు కొనసాగించేందుకు ఈ నెల 9న సీఎం చంద్ర బాబు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గం ఆమోదం తెలపడం రైతుల ఆశలకు జీవం పోసింది. తక్షణం పనులు మొదలు పెట్టాలని రైతులు కోరుతు న్నారు.

వీటిపై దృష్టి సారించాలి

- రూ.210 కోట్లు మంజూరు చేసి హంద్రీ నీవా ప్రాజెక్టు పత్తికొండ (పందికోన) జలాశయం కుడి, ఎడమ కాలువల డిస్ట్రిబ్యూటరీలు, పిల్ల కాలువలు చేసి పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాల్లో 61,394 ఎకరాలకు సాగునీరు అందించాలి.
- అసంపూర్తిగా ఉన్న గాజులదిన్నె జలాశయం సామర్థ్యం 5.50 టీఎంసీలకు పెంపు పనులు నిధులు ఇచ్చి పూర్తి చేయాలి.
- అలగనూరు జలాశయం 2.96 టీఎంసీలు సామర్థ్యం. మట్టి ఆనకట్ట కుంగిపోయి ఐదేళ్లు దాటింది. రూ.26.33 కోట్లు నిధులు మరమ్మతులు చేపట్టాలి.
- రూ.450 కోట్లతో చేపట్టిన కర్నూలు సర్వజన వైద్యశాల, మెడికల్ కాలేజీ భవనాలు, రూ.480 కోట్లతో చేపట్టిన ఆదోని మెడికల్ కళాశాల, బోధనాస్పత్రి నిర్మాణాలు పూర్తి చేసి పేదలకు వైద్య సేవలు అందించాలి.
- జగన్నాథగట్టుపై 192 ఎకరాల్లో రూ.20 కోట్లతో చేపట్టిన రాయలసీమ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల, ఓర్వకల్లు వద్ద 144.92 ఎకరాల విస్తీర్ణంలో రూ.18 కోట్లతో చేపట్టిన డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వావిద్యాలయం, 52 ఎకరాల్లో రూ.80 కోట్లతో చేపట్టిన క్లస్టర్ యూనివర్సిటీ భవనాల పనులు అసంపూర్తిగా ఆగిపోయాయి.
- ఉమ్మడి జిల్లాలో గత టీడీపీ ప్రభుత్వం ఏపీ టిడ్కో కింద 52,318 ఇళ్లు మంజూరు చేస్తే, 31,289 ఇళ్లు నిర్మాణాలు మొదలు పెట్టి 23,645 ఇళ్లు వంద శాతం పూర్తి చేశారు. కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరులో 16,595 ఇళ్లు, నంద్యాల, డోన్, ఆళ్లగడ్డలో 7,050 ఇళ్లు గృహ ప్రవేశానికి సిద్ధంగా ఉన్నాయి. మౌలిక వసతులు కల్పించి లబ్ధిదారులకు అప్పగించాలి.

పారిశ్రామిక రంగంలో ఆశలు

కూటమి ప్రభుత్వం ఉమ్మడి కర్నూలు జిల్లాలో పారిశ్రామికంగా ముందుకు తీసుకెళ్లడానికి హడావిడి చేస్తోంది. అదంతా నేల మీదికి వస్తే జిల్లా ప్రగతికి దోహదం చేస్తుంది. నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎన్ఐసీడీపీ)లో భాగంగా ఓర్వకల్లు ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ అభివృద్ధికి ఫేజ్-1 కింద 2,612 ఎకరాల్లో రూ.2,786 కోట్లతో మౌలిక వసతులు కల్పనకు టెండర్లు పిలిచారు. ఇక్కడ వివిధ పరిశ్రమలు ఏర్పాటు ద్వారా రూ.12 వేల కోట్లు పెట్టుబడులు, 45,071 మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ప్రభుత్వం అంటోంది. జపాన్‌కు చెందిన ఇటోయె మైక్రో టెక్నాలజీ కార్పొరేషన్, ఇండియాకు చెందిన హైడ్రెన్ గ్రూప్, బీఎన్ గ్రూపులు సంయుక్తంగా 130 ఎకరాల్లో రూ.14 వేల కోట్ల పెట్టుబడులతో సెమీకండక్టర్ తయారీ పరిశ్రమను స్థాపనకు ఒప్పందం చేసుకుంది. 1200 ఎకరాల్లో రూ.13 వేల కోట్లతో 'ఈవీ పార్క్' ఏర్పాటుకు ఒప్పందం, 300 ఎకరాల్లో రూ.వెయ్యి కోట్లతో డ్రోన్ హబ్‌ను ఏర్పాటు చేయబోతోంది. పత్తికొండ వద్ద రూ.11 కోట్లతో టమోటా ప్రాసెసింగ్ యూనిట్, ఎమ్మిగనూరు మండలం బనవాసి జెర్సీ పశుక్షేత్రంలో చేనేతలకు ఉపాధి లక్ష్యంగా 97.24 ఎకరాల్లో మెగా టెక్స్‌టైల్ పార్క్‌కు శంకుస్థాపన చేశారు. ఆలూరు, కోడుమూరు, పత్తికొండ నియోజకవర్గాల్లో విండ్ పవర్ యూనిట్లు ఏర్పాటుకు పలు కంపెనీలు ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నాయి. అయితే.. పెండింగ్ ప్రాజెక్టులు, అసంపూర్తి పనులపై కూడా దృష్టి సారించాలి.



ఓర్వకల్లు వద్ద ప్రారంభానికి సిద్ధమైన జైరాజ్ ఇస్పాత్ స్టీల్ పరిశ్రమ



డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయం దుస్థితి



కర్నూలు శివారులో టిడ్కో ఇళ్లు



అసంపూర్తిగా ఆదోని మెడికల్ కాలేజీ భవనాలు

జర్నలిస్టు హెల్త్ స్కీం పొడిగింపు

- డీపీఆర్వో జయమ్మ



కర్నూలు కలెక్టరేట్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): వర్కింగ్ జర్నలిస్టు హెల్త్ స్కీం పొడిగిస్తూ వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ మంగళవారం జీవో. ఎంఎస్.నెం.77ను జారీ చేసిందని డీపీఆర్వో (జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి) కే. జయమ్మ తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అక్రిడిటేషన్లు అమలులో ఉన్న వర్కింగ్ జర్నలిస్టులందరూ ఈ పథకాన్ని వినియోగించుకోవాలన్నారు. ఇందుకు సంబంధించి ప్రీమియం కింద రూ.1250 www.cfms.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా చెల్లించి లబ్ధి పొందాలని తెలిపారు. ప్రీమియం చెల్లించిన జర్నలిస్టులు ఒరిజినల్ చలానా, దరఖాస్తు, రెన్యువల్ చేయించుకున్న అక్రిడిటేషన్ జిరాక్స్ కాపీలను కలెక్టరేట్‌లో ఉన్న సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. జర్నలిస్టు భార్య, భర్త, పిల్లలు, జర్నలిస్టుపై ఆధారపడిన తల్లిదండ్రులకు ఈ స్కీం వర్తిస్తుందన్నారు. ఈ స్కీంలో భాగంగా ప్రభుత్వం కార్పస్ ఫండ్‌ను నిర్వహిస్తూ జర్నలిస్టుల వైద్య ఖర్చులను డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు విధి విధానాలను అనుసరించి చెల్లిస్తుందన్నారు. అక్రిడిటేషన్ కలిగి ఉన్న జర్నలిస్టులం దరూ ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఆర్యవైశ్యులు సీఎంకు రుణపడి ఉంటారు

- పొట్టి శ్రీరాములు విగ్రహం ఏర్పాటుపై హర్షం
- 'కుడా' చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు



కర్నూలు అర్బన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చిన సీఎం చంద్రబాబుకు ఆర్యవైశ్యులంతా రుణపడి ఉంటారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, 'కుడా' చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాల యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజధాని అమరావతిలో అమరజీవీ పొట్టి శ్రీరాములు 50 అడుగుల విగ్రహాన్ని నెలకొల్పేందుకు కూటమి ప్రభుత్వం జీవోను జారీ చేయడంపై హర్షం వ్యక్తంచేశారు. పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు రాజధాని అమరావతిలో 6.8ఎకరాల స్థలాన్ని కేటాయించడంతో ఆర్యవైశ్యులంతా ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుకుంటున్నామని తెలిపారు. ఇచ్చిన హామీని నిలబెట్టు కోవడంలో చంద్రబాబుకు ఎవరూ సాటి రారని, అందుకే ఆర్యవైశ్యులు టీడీపీకి ఎల్లవేళలా అండగా నిలుస్తారని తెలిపారు.

పాముకాటుతో మహిళ మృతి

రుద్రవరం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రగుడి దిన్నె గ్రామానికి చెందిన నాగలక్ష్మమ్మ(58) బుధవారం పాముకాటుకు గురై మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మహిళ గడ్డికి వెళ్లినప్పుడు పాముకాటుకు గురైంది. నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ కోలుకోలేక మృతి చెందింది. .

చికిత్స పొందుతూ బేల్దార్..

బేతంచెర్ల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): బేతంచర్ల నగర పంచాయతీ పరిధిలోని బుగ్గానిపల్లె గ్రామానికి చెందిన మల్లె మాధవస్వామి (55) అనే బేల్దార్ (గౌండ) కర్నూలు ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక బుధవారం మృతి చెందాడు. గ్రామంలో మాధవస్వామి అనే బేల్దార్ ఇంటి పని చేస్తుండగా.. ప్రమాదవశాత్తు మంగళవారం ఇంటిపై నుంచి కింద పడి తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.. చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడని తెలిపారు. మృతుని కుమారుడు రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

గోస్పాడు జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిబగుంట్ల గ్రామ పొలిమేరలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. వివరాలు.. బుధవారం గ్రామానికి చెందిన రైతు శ్రీకాంత్‌రెడ్డి పొలంవద్ద ఉన్న బావి పక్కన మృత దేహం ఉన్నట్లు సమాచారం అందింది. అక్కడికి వెళ్లి పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి వయస్సు దాదాపు 45 ఏళ్లు ఉంటాయి. శరీరంపై ఎలాంటి గాయాలు లేవు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మత్తు పదార్థాలతో జీవితం నాశనం చేసుకోవద్దు

- పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటరామయ్య

వెల్దుర్తి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ మత్తుపదార్థాల జోలికి వెళ్లి జీవితాలు నాశనం చేసుకోవద్దని పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య అన్నారు. బుధవారం వెల్దుర్తి సర్కిల్ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు జాతీయ రహదారి-44 టోల్‌ప్లాజా వద్ద మంగళవారం తనిఖీలు నిర్వహించామన్నారు. ప్రకాశం జిల్లా ఒంగోలు టౌన్‌కు చెందిన అఖిల్ చౌదరి మంజీరా హోటల్ వద్ద అనుమానాస్పదంగా తచ్చాడుతుండడంతో అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద 10గ్రాముల కొకైన్ మత్తు పదార్థాన్ని స్వాధీనం చేసుకున్నారు. సీఐ మధు సూదనరావు, వెల్దుర్తి, క్రిష్ణగిరి ఎస్ఐలు అశోక్, క్రిష్ణమూర్తి ఉన్నారు.

మళ్లీ క్యాంటీన్ వివాదం

- ఉదయం వైద్యుల సంఘం తాళం
- సాయంత్రం పగులకొట్టిన నిర్వాహకులు



క్యాంటీన్ వద్ద ఉన్న ఏపీజీడీఏ వైద్యులు

కర్నూలు హాస్పిటల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మెడికల్ కాలేజీ(కేఎంసీ) ఆవరణలో ఉన్న క్యాంటీన్ వివాదం రోజురోజుకూ ముదురుతుంది. క్యాంటీన్ నిర్వాహకులు తమదేనని అంటే, ఒక వైద్యుల వర్గం.. కాదు కాదు.. క్యాంటీన్ తమదేనని వాదిస్తుంది. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘం (ఏపీజీడీఏ) కర్నూలు కేఎంసీ బ్రాంచ్ అధ్యక్షుడు డా. బ్రహ్మాజీ మాస్టర్ ఆధ్వర్యంలో వైద్యులు, వైద్యవిద్యార్థులు కలిసి క్యాంటీన్‌కు తాళం వేశారు. సాయంత్రం మళ్లీ కొందరు క్యాంటీన్ తాళం పగులకొట్టి ప్రారంభించారు. గతంలో కూడా రెండుసార్లు ఇదే విధంగా ఏపీజీడీఏ సంఘం కార్యవర్గం ప్రతినిధులు తాళం వేయడం ఆ తర్వాత పగులకొట్టడం జరిగింది. ఏపీజీడీఏ అధ్యక్షుడు డా. బ్రహ్మాజీ మాస్టర్ మాట్లాడుతూ రిమూవ్‌డ్ ఫ్రమ్ సర్వీస్ అయిన వ్యక్తికి క్యాంటీన్ నిర్వహించే హక్కు లేదన్నారు. కాలేజీ ఆవరణలో క్యాంటీన్ తాళం పగులగొట్టడం సరికాదని, పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు.

● క్యాంటీన్ నిర్వాహకులు లీగల్‌గా తమకు హక్కు ఉందని, బలవంతంగా క్యాంటీన్‌ను మూసివేయడం తగదని అన్నారు. దాన్ని పరిష్కరించడానికి ప్రిన్సిపాల్ గానీ, పోలీసులు గానీ ముందుకు రాలేదు.

ఇన్‌చార్జీలే దిక్కు..!

- పది నెలలుగా జిల్లా రిజిస్ట్రార్ పోస్టు ఖాళీ
- స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో గాడి తప్పిన పాలన
- సరైన సేవలు అందక ప్రజల అవస్థలు



కర్నూలులోని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం



రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం అందించే శాఖల్లో అత్యంత కీలకమైనది స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ. ప్రస్తుతం ఆ శాఖలో పాలన గాడి తప్పింది. సిబ్బంది కొరతతో సతమతమవుతోంది. జిల్లా రిజిస్ట్రార్‌తో పాటు, కర్నూలు-1, 2 గుడూరు సబ్-రిజిస్ట్రార్లు లేక ఇన్‌చార్జ్‌లతో నెట్టుకొస్తున్నారు. అత్యధికంగా కర్నూలు, కల్లూరు, నంద్యాల కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. కర్నూలు జిల్లా రిజిస్ట్రార్ పోస్టు పది నెలలకు పైగా ఖాళీగా ఉండటంతో సేవలు సరిగా అందక పాలన ముందుకు సాగడం లేదన్న విమర్శలున్నాయి. ప్రతిరోజూ స్లాట్ బుకింగ్‌లో అధిక రిజిస్ట్రేషన్లు జరిగే కర్నూలు, ఆదోని, నంద్యాల ఆర్వోల్లో ప్రజల తాకిడి అధికంగా ఉంటుంది. నిత్యం వందలాదిగా రిజిస్ట్రేషన్ సేవల కోసం కార్యాలయాలకు వచ్చే క్రయ, విక్రయదారులు ఇబ్బందులు పడుతున్నారు.

కల్లూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): కర్నూలు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో ఇన్‌చార్జీ లతో పాలన కొనసాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం అందించే రిజిస్ట్రేషన్ శాఖలో జిల్లా రిజిస్ట్రార్‌తో పాటు, కర్నూలు-1 ,2 గుడూరు సబ్-రిజిస్ట్రార్లు లేక ఇన్‌చార్జ్‌లతో నెట్టుకొస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 24 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. ప్రతిరోజూ దాదాపు 400-500 వరకు రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. అత్యధికంగా కర్నూలు, కల్లూరు, నంద్యాల కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. కర్నూలు జిల్లా రిజిస్ట్రార్ పోస్టు పది నెలలకు పైగా ఖాళీగా ఉండటంతో సేవలు సరిగా అందక పాలన ముందుకు సాగడం లేదన్న విమర్శలు న్నాయి. కర్నూలు డీఆర్‌గా సీహెచ్.నాగమల్లేశ్వర్ రావు బదిలీ అనంతరం ఇప్పటివరకు రెగ్యులర్ జిల్లా రిజిస్ట్రార్‌ను నియమించకపోవడంతో పాలన పడకేసింది. నిత్యం వందలాదిగా రిజిస్ట్రేషన్ సేవల కోసం కార్యాలయాలకు వచ్చే క్రయ, విక్రయదారులు ఇబ్బందులు పడుతున్నారు.

ఈ ఏడాది లక్ష్యం రూ.399 కోట్లు

కర్నూలు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ. 399 కోట్ల లక్ష్యంగా పెట్టుకున్నారు. కర్నూలు జిల్లాలో 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. అందులో కర్నూలు 1, 2, కల్లూరు, గుడూరు, కోడుమూరు, మంత్రాలయం, ఆదోని, ఆస్పరి, ఎమ్మిగనూరు, పత్తికొండ, ఆలూరు ఉన్నాయి. వాటిలో రిజిస్ట్రేషన్ శాఖ అధిక ఆదాయం కర్నూలు-1, 2 అలాగే కల్లూరు నుంచి వస్తోంది. కీలకమైన స్థానాల్లో రెగ్యులర్ సబ్-రిజిస్ట్రార్‌లను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

2024లో నిర్వహించిన బదిలీల్లో..

గత పది నెలలుగా కర్నూలు జిల్లా రిజిస్ట్రార్ పోస్టు ఖాళీగా ఉంది. 2024లో ప్రభుత్వం నిర్వహించిన సాధారణ బదిలీల్లో డీఆర్ సీహెచ్.నాగ లింగేశ్వరరావు విశాఖపట్నం బదిలీపై వెళ్లారు. ఆతర్వాత కొన్నిరోజులు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ కర్నూలు డీఐజీ పీజీయస్. కళ్యాణి ఇన్‌చార్జ్ డీఆర్‌గా వ్యవహరించారు. ఆ తర్వాత చెన్నకేశవ రెడ్డిని ఇన్‌చార్జ్‌గా నియమించగా కొద్దిరోజులు మాత్రమే విధుల్లో ఉన్నారు. ఆ తర్వాత సెలవుతో వెళ్లారు. ఆయన స్థానంలో అనంతపురానికి చెందిన భార్గవ్‌కు కర్నూలు డీఆర్‌గా ఇన్‌చార్జ్ బాధ్యతలి వ్వగా కొన్నిరోజులు మాత్రమే పనిచేశారు. ప్రస్తుతం నంద్యాల డీఆర్ జానకిదేవికి కర్నూలు డీఆర్‌గా ఇన్‌చార్జ్ బాధ్యతలు అందించారు. తమ సమస్యల పరిష్కారం కోసం డీఆర్‌ను కలిసేందుకు వచ్చే ప్రజలకు సరైన సేవలు అందడంలేదు. ఇలా కీలకమైన జిల్లా రిజిస్ట్రార్ పోస్టును భర్తీ చేయడంలో అధికారులు ప్రభుత్వం విఫలమయ్యారని క్రయ, విక్రయదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సేవలు అందక వినియోగదారులు అవస్థలు పడుతున్నారు.

ప్రజలు సతమతం..

కర్నూలు జాయింట్ సబ్-రిజిస్ట్రార్ కార్యాల యంలో రెగ్యులర్ అధికారులు లేకపోవడంతో ప్రజలు సతమతమవుతున్నారు. ప్రతిరోజూ స్లాట్ బుకింగ్‌లో అధిక రిజిస్ట్రేషన్లు జరిగే కర్నూలు, ఆదోని, నంద్యాల ఆర్వోల్లో ప్రజల తాకిడి అధికంగా ఉంటుంది. సీనియర్ అసిస్టెంట్‌కు సబ్-రిజిస్ట్రా ర్‌గా కర్నూలు ఇన్‌చార్జ్ ఇవ్వడం, ఇద్దరు జాయింట్ సబ్ రిజిస్ట్రార్లు ఉండాల్సిన చోట ఒక్కరే పనిచేస్తుండటంతో సహజంగానే ఒత్తిడి అధికంగా పడుతోంది. అటు ఆదోనిలో డిప్యుటేష న్‌పై సునంద విధులు నిర్వహిస్తున్నారు. గుడూరులో ఇన్‌చార్జ్ సబ్-రిజిస్ట్రార్ విధుల్లో ఉన్నారు. నంద్యాల పరిధిలో ఆవుకు, బనగానపల్లె, నంద్యాల ఆర్వోలకు రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్ల స్థానంలో ఇన్‌చార్జ్‌లే ఉన్నారు.

ప్రభుత్వానికి నివేదించాం

ఉమ్మడి కర్నూలు జిల్లాలో రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్ పోస్టుల ఖాళీలపై రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికలు పంపాం. కర్నూలు-1, 2, గుడూరు, అవుకు, బనగానపల్లె, నంద్యాల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అందులో కీలకమైన కర్నూలు ఆర్వోలో రెండు రెగ్యులర్ అధికారుల కోసం పలు పర్యాయాలు ప్రభుత్వానికి లేఖలు రాశాం. ప్రస్తుతం సాధారణ బదీలలకు అవకాశం లేదు. మరోసారి ప్రభుత్వానికి లేఖ రాస్తాం. **● పీజీయస్.కళ్యాణి, డీఐజీ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ, కర్నూలు**

వాటా ఇస్తేనే..

- కొందరు శానిటరీ ఇన్‌స్పెక్టర్ల డిమాండ్
- యూనియన్ నాయకులతో కలిసి దందా
- ఇబ్బందులు పడుతున్న కార్మికులు
- హాట్ టాపిక్‌గా బకాయిల పంచాయితీ



కర్నూలు న్యూసిటీ, జూలై 16(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలో ప్రజారోగ్య విభాగంలో పనిచేస్తున్న కార్మికులకు ఇటీవలే ప్రభుత్వం బకాయి వేతనాలను విడుదల చేసింది. సుమారు 21 మంది కార్మికులకు మూడేళ్ల కిందట రావాల్సిన బకాయిలు వచ్చాయి. ఈ క్రమంలో బకాయి వేతనాలు శానిటరీ ఇన్స్‌పెక్టర్ల ఖాతాలో జమఅయ్యాయి. వేతనాల్లో తమ వాటా ఇస్తేనే మిగతా డబ్బులు ఇస్తామని కొందరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చెబుతున్నట్లు సమాచారం.

దందాకు తెర..

శానిటరీ ఇన్‌స్పెక్టర్లు కార్మిక సంఘాల నాయకులతో దందాకు తెర లేపారు. కార్మికుల నుంచి అందినకాడికి దోచుకునేందుకు పావులు కదుపుతున్నారు. బకాయి వేతనాలు తామే ప్రభుత్వంతో ఒప్పించి ఇప్పించామని యూనియన్ నాయకులు అంటున్నారు. అయితే వేతనం రూ.13 వేలు ఉండగా రూ.15 వేలు చేయించింది తామేనని శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చెప్పుకుంటున్నారు. మూడేళ్ల క్రితం పారిశుధ్య విభాగంలో 21 మంది కార్మికులను విధుల్లోకి తీసుకున్నారు. వారికి అప్పట్లో ఆరు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రస్తుతం ఆ బకాయిలొచ్చాయి. ఒక్కో కార్మికుడికి ఆరు నెలలకు కలిపి రూ.90 వేలు రావాలి. ఒక్కో కార్మికుడి నుంచి శానిటరీ ఇన్‌స్పెక్టర్లు రూ.10 నుంచి రూ.15 వేలు డిమాండ్ చేస్తుండగా యూనియన్ నాయకులు ఒక్కో కార్మికుడి నుంచి రూ.2 నుంచి రూ.3 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం వేతనాల పంచాయితీ నగర పాలకలో హాట్ టాపిక్‌గా మారింది. కొత్తగా బాధ్యతలు చేపట్టిన కమిషనర్ ఈ విషయంపై స్పందించి న్యాయం చేస్తారని కార్మికులు ఆశిస్తున్నారు. బకాయిలను నేరుగా కార్మికుల ఖాతాల్లో జమచేయవచ్చు. అధికారులు ఆ దిశగా ఆలోచించకుండా వాటాలు పంచుకోవచ్చనే ఉద్దేశ్యంతో శానిటరీ ఇన్‌స్పెక్టర్ల ఖాతాలో జమ చేశారు. ఈ నేపథ్యంలోనే వాటాలు పంచుకోవడానికి మార్గం సులువైంది.

ఫిర్యాదు చేస్తే చర్యలు

కార్మికుల నుంచి శానిటరీ ఇన్‌స్పెక్టర్ల డబ్బులు వసూలు చేసినట్లు ఫిర్యాదు చేస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాము. ఇప్పటి వరకు ఎవ్వరూ మా దృష్టికి తీసుకు రాలేదు. మాకు తెలిసి కూడ కార్మికులను ఫిర్యాదు చేయమని చెప్పినా ఎవ్వరు ముందుకు రావడము లేదు. అలాంటప్పుడు చర్యలు ఎలా తీసుకుంటాం. ముగ్గురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు మాత్రమే ఇవ్వలేదని తెలిసింది. మిగిలిన వారందరు కార్మికులకు డబ్బులు ఇచ్చేసారు. **- డా.కే. విశ్వేశ్వరరెడ్డి, మెడికల్ హెల్త్ ఆఫీసర్, నగర పాలక సంస్థ, కర్నూలు**

చారిత్రక కట్టడాలను పరిరక్షించుకోవాలి

- కర్నూలు జిల్లా మేధావుల వేదిక ప్రతినిధులు



సమావేశానికి హాజరైన జిల్లా మేధావుల వేదిక ప్రతినిధులు

కర్నూలు కల్చరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని చారిత్రక కట్టడాలను, ప్రదేశాలను పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకత ప్రతి ఒక్కరిపై ఉందని కర్నూలు జిల్లా మేధావుల వేదిక ప్రతనిధులు అన్నారు. బుధవారం నగరంలోని మద్దూరునగర్‌లో గల పింగళి సూరన తెలుగుతోట సమావేశహాలులో జిల్లా మేధావుల వేదిక ఆధ్వర్యంలో చర్చాగోష్టి నిర్వహించారు. సామాజికవేత్త కేసీ కల్కూర అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆచార్య ఎస్ మన్సూర్ రహమాన్ సమన్వయకర్తగా వ్యవహరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ వందల సంవత్సరాల చరిత్ర కలిగిన ప్రభుత్వ భవనాలైన జడ్పీ భవనం, మున్సిపల్ స్కూల్, గడియారం ఆసుపత్రి, జీజీహెచ్(పెద్దాసుపత్రి) వాటి నిర్వహణ గాలికొదిలేశారన్నారు. ఆ గొప్ప భవనాలు కనిపించకుండా వాణిజ్య ప్రకటనల హోర్డింగ్స్‌తో దాచివేశారని విమర్శించారు.

ఉస్మానియా కళాశాల భవానికి వారసత్వ ప్రదేశంగా, పెద్ద కడుమూరులోని రాయల చెరువును ప్రపంచ వారసత్వ నీటి నిర్మాణంగా గుర్తింపు వచ్చేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కేతవరం రాత్రి చిత్రాల పరిరక్షణకు అక్కడ కొండ ప్రాంతాలలో జరుగుతున్న మైనింగ్ పనులు ఆపివేయాలని కోరారు. ప్రాచీన ప్రార్థనా స్థలాలుగా చరిత్రకెక్కిన దేవాలయాలు, దర్గాలు, చర్చీలు, గురుద్వారాలు, జైన మందిరాలకు అవసరమైన అభివృద్ధి సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఇందుకు ప్రభుత్వానికి నివేదికను సమర్పిస్తామని వారు పేర్కొన్నారు.

నగదు తస్కరించిన వారిపై చర్యలు

- విధుల నుంచి తొలగింపు
- 600 సీసీ కెమెరాలు ఏర్పాటు
- ఈవో శ్రీనివాసరావు

నంద్యాల కల్చరల్, జూలై 16(ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్రంలో స్వామివారి హుండీ నుంచి నగదును తస్కరించిన పరిచారకుడు విద్యాధర్‌పై చర్యలు తీసుకుంటూ విధుల నుంచి తొలగించినట్లు ఆలయ ఈవో శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆలయ ప్రధాన అర్చకులు వీరయ్యస్వామి, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి హరిదాసు సమ క్షంలో పంచనామా నిర్వహించారు. తస్కరించిన నగదు పరిశీలనలో విద్యాధర్ రూ.24,220లు నగదు తస్కరించినట్లు తేలిందని ఈవో తెలిపారు. ప్రాథమికంగా అతడిని విధుల నుంచి తొలగించి సమగ్ర విచారణకు ఆదేశించామన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సైతం ఫిర్యాదు చేశామని అన్నారు. ఆలయ భద్రతా దృష్ట్యా దేవస్థానంలోని వివిధ ప్రదేశాల్లో 600 సీసీ కెమెరాలు ఏర్పాటుచేశామని ఈవో తెలిపారు.

గ్రామీణ వైద్యుల గుర్తింపునకు కృషి చేస్తా

- మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు టీడీ జనార్దన్
- గ్రామీణ వైద్యులపై అపారమైన నమ్మకం: మంత్రి టీజీ భరత్
- ప్రభుత్వం వీరికి శిక్షణ ఇవ్వాలి : కేజీ గోవిందరెడ్డి
- కర్నూలులో గ్రామీణ వైద్యుల మహాసభ



మాట్లాడుతున్న టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు టీడీ జనార్దన్

కర్నూలు హాస్పిటల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ వైద్యుల గుర్తింపునకు కృషి చేస్తాననని మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, ఏపీ గ్రామీణ వైద్యుల సంక్షేమం సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు టీడీ జనార్దన్ అన్నారు. బుధవారం నగరంలోని జిల్లా రైల్వేగేటు పక్కన ఉన్న శ్రీలక్ష్మి కల్యాణ మండపంలో ఉమ్మడి జిల్లా గ్రామీణ వైద్యుల మహాసభ డా.కేజీ గోవిందరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్దన్, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, కర్నూలు జిల్లా టీడీపీ అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా టీడీ జనార్దన్ మాట్లాడుతూ గ్రామీణ వైద్యుల సేవలు చాలా ఉపయోగపడుతాయని, వారి సేవలను వినియోగించుకునేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ గ్రామీణ వైద్యులపైన అపారమైన నమ్మకం ఉందని అన్నారు. వీరి సేవలను ప్రభుత్వం వినియోగించుకునేలా కృషి చేస్తానన్నారు. కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ తాను అనారోగ్యానికి గురైతే ఆర్ఎంపీ వైద్యులతోనే వైద్యం చేయించుకుంటానన్నారు. గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా గౌరవాధ్యక్షుడు కేజీ గోవిందరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 60 శాతం మంది గ్రామీణ వైద్యులు ప్రజలకు సేవలు అందిస్తున్నారన్నారు. ప్రభుత్వం పారామెడికల్ బోర్డులో రిజిస్ట్రేషన్ ఇచ్చిన ప్రభుత్వం వీరికి శిక్షణ ఇవ్వాలని కోరారు. దేశ వ్యాప్తంగా గ్రామీణ వైద్యుల సమస్యలు పరిష్కారానికి సహకరిస్తానన్నారు. కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాధాకృష్ణ, కార్యదర్శి ఎంఎన్ రాజు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి దస్తగిరి, కర్నూలు, నంద్యాల జిల్లా అధ్యక్షులు గార్లేయపురం శ్రీనివాసులు, నాగేశ్వరరెడ్డి, కర్నూలు జిల్లా సెక్రటరీ ప్రభాకర్ రెడ్డి, కోశాధికారి రఘునాథరెడ్డి, జిల్లా నాకులు ఇల్లూరి నరసింహ, నంద్యాల జిల్లా నాయకులు నాగేశ్వరరావు, సెక్రటరీ సురేష్‌బాబు పాల్గొన్నారు.

కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలి

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

కర్నూలు న్యూసిటీ, జూలై 16(ఆంధ్రజ్యోతి): కార్మికులు పోరాటలకు సిద్ధం కావాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు వి.నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షుడు పీఎస్. రాధాక్రిష్ణ అధ్యక్ష తన బుధవారం కేకే భవన్‌లో సీఐటీయూ జిల్లా కార్యకర్తల వర్క్‌షాపు నిర్వహించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మోదీ విధానాలను దొడ్డిదారిన అమలు చేయడానికి ప్రయత్నిస్తుందని విమర్శించారు. విద్యుత్ రంగంలో తీసుకువచ్చిన మార్పులకు అనుగుణంగా స్మార్ట్ మీటర్లను బిగించే ప్రయత్నం చేస్తుందన్నారు. రాష్ట్ర కార్యదర్శి ముజుఫర్ అహ్మద్ మాట్లాడుతూ సీఐటీయూ ఆల్ ఇండియా మహాసభలు విశాఖపట్టణంలో డిసెంబరు 31 నుంచి 2026 జనవరి 4 వరకు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ పి.నిర్మల, జిల్లా కార్యదర్శివర్గసభ్యులు సీహెచ్.సాయిబాబా, విజయ్, నారాయణ స్వామి, ప్రభాకర్, గోపాల్ పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి



మొక్క నాటుతున్న ఎంపీ నాగరాజు, సొసైటీ నిర్వాహకులు

కర్నూలు అర్బన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని కర్నూలు ఎంపీ బస్తి పాటి నాగరాజు అన్నారు. బుధవారం నగరంలోని తన కార్యాలయంలో భాగ్యానంద్ బోటానికల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆయన మొక్కలు నాటారు. ఎంపీ నాగరాజు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు చూపుతున్న పర్యావరణ దృక్పథానికి అనుగుణంగా సొసైటి వారు జిల్లాలో 30 వేల మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ ప్రవీణ్, రాష్ట్ర కురువ కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి: రాయలసీమ యూనివర్సిటీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. బుధవారం నగరంలోని ఎంపీ కార్యాలయంలో ఉపకులపతి వి.వెంకట బసవరావు ఎంపీ నాగరాజును కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈసందర్భంగా రాయలసీమ యూనివర్సిటీకి సంబంధించిన పలు సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు.

పురమిత్ర యాప్‌ను వినియోగించుకోండి

కర్నూలు అర్బన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): నగర ప్రజలు పురమిత్ర యాప్ సేవలను వినియోగించుకోవాలని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ సూచించారు. బుధవారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఈ యాప్ ద్వారా సమస్యలను ఫొటో తీసి పోస్ట్ చేయాలని, వెంటనే అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఈ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని స్మార్ట్ ఫోన్‌తో అక్కడి సమస్యల తీవ్రత తెలిసేలా ఫొటోలు తీసీ అప్లోడ్ చేస్తే సిబ్బంది 24 గంటల్లో సమస్యను పరిశీలించేందుకు వస్తారన్నారు.

విధులకు గైర్హాజరు..!

● పట్టించుకోని అధికారులు
● ఇబ్బందులు పడుతున్న ప్రజలు

ఓర్వకల్లు, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో సచివాలయ, రైతు సేవా కేంద్రాల్లో పని చేస్తున్న సిబ్బంది విధులకు గైర్హాజరవుతున్నారు. దీంతో ప్రజలు పలు ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారు. అధికారులు సమయపాలన పాటించక పోవడంతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. నిబంధనల ప్రకారం ఉదయం 10 గంటల లోపు విధులకు హాజరు కావాల్సి ఉంది. 11 గంటలైనా విధులకు రావడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. మండలంలోని హుశేనాపురం రైతు సేవా కేంద్రాలు 1, 2 లలో అధికారులు ఉదయం 11 గంటలైనా విధులకు హాజరు కాలేదు. కార్యాలయాలకు తాళాలు వేసి ఉన్నాయి. తాళాలు తెరుచుకోకపోవడంతో రైతులు కార్యాలయాల వద్ద పడిగాపులు కాచి వెనుదిరిగి వెళ్లాల్సి వచ్చింది. అలాగే సచివాలయం 1, 2 కేంద్రాల్లో ఉదయం 11 గంటలైనా ఇద్దరు డిజిటల్ అసిస్టెంట్లతో పాటు మరో ముగ్గురు అధికారులు మాత్రమే విధులకు హాజరయ్యారు. మిగతా అధికారులు విధులకు హాజరు కాలేదు. సంబంధిత అధికారులు కూడా తనిఖీలు చేయకపోవడంతో సచివాలయం, రైతు సేవా కేంద్రాల్లో సిబ్బంది సక్రమంగా విధులకు హాజరు కావడం లేదని ఆరోపణలు బలంగా వినిపిస్తు న్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సచివా లయాలు, రైతు సేవా కేంద్రాలపై నిఘా పెంచాలని ప్రజలు కోరుతున్నారు.


సచివాలయంలో సిబ్బంది లేక ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు



హుశేనాపురంలో తలుపులు తెరుచుకోని 2వ రైతు సేవా కేంద్రం

ఎన్టీఆర్‌కు నివాళి


ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకులు

కర్నూలు అర్బన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ కార్యాలయంలో పార్టీ నాయకులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నగరంలో బుధవారం జరిగే గ్రామీణ వైద్యుల సదస్సుకు హాజరు కావడానికి వెళ్తూ మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు టీడీ జనార్ధన్ టీడీపీ కార్యాలయానికి వచ్చారు. ఆయనకు ఎంపీ నాగరాజు, ఎమ్మెల్యే కేఈ శ్యామ్ బాబు, కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి ఘన స్వాగతం పలికారు. అనంతరం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి వారు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకెపోగు ప్రభాకర్, నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సత్రం రామకృష్ణ, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ థరూర్ జేమ్స్ పాల్గొన్నారు.

గర్భిణి ప్రాణాలు కాపాడిన వైద్యులు



మాట్లాడుతున్న గైనకాలజిస్టు డాక్టర్ మాబూని

కర్నూలు హస్పిటల్, జూలై 16(ఆంధ్రజ్యోతి): ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న ఓ గర్భిణికి అమీలియో వైద్యులు హైరిస్క్ ఆపరేషన్ చేసి ప్రాణాలు కాపాడారు. బుధవారం హస్పిటల్‌లో గైనకాలజిస్టు డాక్టర్ మాబూని, అనస్థీషియా వైద్యులు డాక్టర్ విజేతలు విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ప్రకాశం జిల్లా గిద్దలూరుకు చెందిన గర్భిణీ స్వప్న మూడు రోజుల క్రితం చికిత్స నిమిత్తం హస్పిటల్‌లో చేరింది. గర్భిణీకి ఆపరేషన్ సమయంలో ప్లెట్‌లెట్లు కణాలు కేవలం 20వేలు మాత్రమే ఉండగా.. బీపీ 200/140తో పాటు అధిక రక్తస్రావంతో గర్భిణి బాధపడుతుంది. ఇలాంటి హైరిస్క్ ప్రసవంను విజయవంతంగా నిర్వహించి తల్లిబిడ్డ ప్రాణాలను కాపాడినట్లు గైనకాలజిస్టు డా.మాబూని వెల్లడించారు. హైరిస్క్ ప్రెగ్నెసిని విజయవంతంగా నిర్వహించిన వైద్యులను హస్పిటల్ ఎండీ డాక్టర్ లక్ష్మీప్రసాద్ అభినందించారు.

రాయపాటికి అంతర్జాతీయ అవార్డు



కర్నూలు కల్చరల్, జూలై 16(ఆంధ్రజ్యోతి): కర్నూలుకు చెందిన లయన్స్ క్లబ్ ప్రతినిధి, సామాజిక సేవకుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాక్ దేశం నుంచి అంతర్జాతీయ అవార్డు అందుకున్నారు. రిపబ్లిక్ ఆఫ్ ఇరాక్ దేశానికి చెందిన విక్టోరియా యూనివర్సిటీ ఆఫ్ కల్చర్ అండ్ వరల్డ్ పీస్ సంస్థ బుధవారం ఈ అవార్డును అంతర్జాలం ద్వారా శ్రీనివాస్‌కు అందజేసింది. ఈసంస్థ ఏటా ప్రపంచ వ్యాప్తంగా సామాజిక సేవా కార్యక్రమాలు అందిస్తున్న వారిని గుర్తించి, వారికి ఈ అవార్డులను, ధ్రువీకరణ పత్రం ద్వారా అందిస్తోంది. కర్నూలు నగరానికి చెందిన డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ ముప్పై సంవత్సరాలుగా విద్య, ఆరోగ్య, సామాజిక రంగాల్లో తనదైన సేవలు అందిస్తున్నారు. ఈ సందర్భంగా రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ పురస్కారం తనపై మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులో సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూ సమాజాభివృద్ధికి మరింత కృషి చేస్తామని తెలిపారు.

కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలి

కర్నూలు కల్చరల్, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ సంస్థకు నిధులు కేటాయించేలా చూడాలని ఏపీ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఎన్ వెంకట రామరాజు టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్ధన్‌కు విజ్ఞప్తి చేశారు. బుధవారం కర్నూలు పర్యటనకు వచ్చిన టీడీ జనార్ధన్‌ను వెంకటరామరాజు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. జిల్లాలో పేద వర్గాలకు చెందిన బ్రాహ్మ ణులు, అర్చకులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్‌ను దేవాదాయ శాఖ పరిధిలోకి తీసుకురావాలని సూచించారు.

ఉపాధ్యాయులను బదిలీ అయిన చోటుకు పంపాలి

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఇటీవల హిందీ స్కూల్ అసిస్టెంట్లు బదిలీల ప్రక్రియలో భాగంగా బదిలీ ఆర్డర్స్ పొంది కూడా వారు పాత స్థానాల్లో పని చేస్తున్నారని, విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకుని బదిలీ ఆర్డర్స్‌కు పొందిన చోటుకు పంపాలని బహుజన టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు సతీష్ కుమార్ డీఈవో శామ్యూల్ పాల్‌కు వినతి పత్రం అందజేశారు. చాలా మంది ఉపాధ్యాయులు బదిలీ అయి నప్పటికీ కొత్త స్థానాల్లో వెళ్లకపోవడం వల్ల నష్టపోతున్నారనీ అన్నారు. కార్యక్రమంలో ఎం.జగదీష్‌బాబు, దస్తగిరన్న, రవికుమార్ పాల్గొన్నారు.

నిబంధనలు తుంగలో తొక్కి బదిలీలు

● భూసర్వే కార్యాలయం ముందు నిరసన

కర్నూలు కలెక్టరేట్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలను జిల్లా భూసర్వే అధికారి తుంగలో తొక్కి బదిలీల కౌన్సెలింగ్ ముగించారని దళిత, గిరిజన సంఘం నాయకులు ఆరోపించారు. బుధవారం జిల్లా భూసర్వే కార్యాలయం ముందు వారు నిరసన వ్యక్తం చేశారు. బదిలీలు పూర్తయినా కూడా జిల్లా భూసర్వే కార్యాలయం చుట్టూ విలేజ్ సర్వేలు ప్రదక్షిణలు చేస్తున్నారు. తక్కువ ర్యాంకు కలిగిన వారికి పోస్టింగ్ ఇవ్వకుండా అత్యధిక ర్యాంకు పొందిన వారికి కోరిన గ్రామ సచివాలయానికి బదిలీ చేశారని ఆరోపించారు. కర్నూలు, కోడుమూరు, ఓర్వకల్లు, కల్లూరు మండలాలకు విలేజ్ సర్వేలతో అధిక మొత్తంలో డబ్బులు తీసుకుని పోస్టింగ్‌లు ఇచ్చారని ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. దీనిపై కలెక్టర్ సమగ్ర విచారణ జరిపి జిల్లా భూసర్వే అధికారులపై చర్యలు తీసుకోవాలని దళిత, గిరిజన సంఘాల నాయకులు కోరారు.


నిరసన తెలుపుతున్న దళిత, గిరిజన సంఘాల నాయకులు

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే

సి.బెళగల్, జూలై 16(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి అన్నారు. బుధవారం గంగ్రేవుల పక్కన పంపుహౌస్ దగ్గర గురురాఘవేంద్ర పులకుర్తి ఎత్తిపోతల పథకం మోటార్లను ఆన్ చేసి నీటిని విడుదల చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందేలా చూడాల్సిన బాధ్యత ఎల్లెల్సీ అధికారులదే అన్నారు. గురురాఘవేంద్ర డీఈ చిదంబర్‌రెడ్డి, ఎల్లెల్సీ డీఈ సుబ్బరాయుడు, ఛైర్మన్ మహేశ్వరరెడ్డి, సింగిల్ విండో ప్రెసిడెంట్ తిమ్మప్ప, టీడీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్, ఎంపీటీసీ ఈరన్నగౌడు పాల్గొన్నారు.

సస్యరక్షణతోనే అధిక దిగుబడులు

కల్లూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పంటల్లో సస్యరక్షణతోనే అధిక దిగుబడులు సాధించవచ్చని నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా ప్రిన్సిపల్, శాస్త్రవేత్త డాక్టర్.రామకృష్ణరావు రైతులకు సూచించారు. బుధవారం కల్లూరు మండలం పందిపాడు, కల్లూరులో వ్యవసాయ అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పత్తి, కంది, మొక్కజొన్న పంటలను ఆశించే పురుగు నివారణ కోసం సస్యరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం డాక్టర్ రామకృష్ణరావు మొక్కజొన్న పంటను పరిశీలించారు. కార్యక్రమంలో డిఆర్సీ వ్యవసాయ అధికారులు నాగసరోజ, శశిధర్‌రెడ్డి, ఎంపీఈవోలు నాగరాజు, సువర్ణ, రైతులు పాల్గొన్నారు.

కష్టపడి చదవాలి

కర్నూలు స్పోర్ట్స్, జూలై 16(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలని మాజీ ఐజీ షేక్ మహ్మద్ ఇక్బాల్ అన్నారు. బుధవారం సీ.బెళగల్ మండలంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. అనంతరం పాఠశాలకు కావాల్సిన మౌలిక సదుపా యాలను విద్యార్థులకు ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు గుడిపల్లి సురేంద్ర, ఎంఈవో ఆదాం బాషా, హెచ్‌ఎం నాగలక్ష్మి, విద్యా కమిటీ ఛైర్మన్ గోవిందు పాల్గొన్నారు.

సీజన్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

సి.బెళగల్, జూలై 16(ఆంధ్రజ్యోతి): సీజన్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో భాస్కర్ అన్నారు. బుధవారం మండలంలోని ముడుమాల గ్రామం లో చికున్ గున్యా, టైఫాయిడ్, మలేరియా జ్వరాలతో బాధపడుతున్న వారికి వైద్యపరీక్షలు నిర్వహించారు. భాస్కర్ మాట్లా డుతూ ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ఆయన వెంట మలేరియ అధికారి లూకరాజు, సంచార నోడల్ అధికారి రఘు, ఎంపీడీవో రాణెమ్మ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

ఓర్వకల్లు, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లులోని చెన్నకేశవస్వామి, ఆంజనేయస్వామి, పూడిచెర్లలోని రామలింగేశ్వర స్వామి ఆలయాల ధర్మకర్తల మండళ్లకు దరఖాస్తు చేసుకోవాలని దేవదాయ ధర్మదాయ అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్ రెడ్డి బుధవారం తెలి పారు. కర్నూలు దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్‌కు ఈ నెల 29వ తేదీలోపు దరఖాస్తులను సమర్పించాలన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట

● మేయర్ బీవై రామయ్య

కర్నూలు న్యూసిటీ, జూలై 16(ఆంధ్రజ్యోతి): నగరంలో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్ద పీట వేసినట్లు మేయర్ బీవై రామయ్య అన్నారు. బుధవారం నగర పాలక కార్యాలయంలో స్థాయి సంఘం సమావేశం నిర్వహించారు. మొత్తం 22 తీర్మానాలు, రూ.7.31 కోట్ల అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ పి.విశ్వనాథ్, అదనపు కమిషనర్ ఆర్జీవీ కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డా.విశ్వేశ్వర్ రెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఆర్‌వో జునైద్, ఇశ్రాయేలు, ఇన్‌చార్జి ఎస్‌ఈ శేషసాయి, అకౌంట్స్ ఆఫీసర్ చుండీ ప్రసాద్, టీపీఆర్‌వో వెంకటలక్ష్మి, పారిశుధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు పాల్గొన్నారు.

పంటలపై అవగాహన కల్పించండి

కోడుమూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): పంటలపై రైతులకు అవగాహన కల్పించి అధిక దిగుబడులు సాధించే విధంగా కృషి చేయాలని మండల వ్యవసాయ అధికారి రవిప్రకాష్ అన్నారు. స్థానిక వ్యవసాయ కార్యాల యంలో బదిలీపై వచ్చిన సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ రైతులకు ఎరువులు, పురుగుమందులు అందించాలన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని తప్పకుండా నిర్వహించాలన్నారు.

బావుల్లో గంబూజియా చేపలు

కర్నూలు న్యూసిటీ, జూలై 16(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పరిధిలో 25 నీటి బావులను గుర్తించి అందులో 25 వేల గంబూ జియా చేపలను వదలినట్లు ప్రజారోగ్య విభాగం సీనియర్ ఎంట మాలజిస్టు వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం వివిధ ప్రాంతాల్లో బావుల్లో గంబూజియా చేపలను వదిలారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గంబూజియా చేపలు రోజుకు 100 దోమల లార్వాలను తినగలిగే సామర్థ్యం ఉందన్నారు.

పారిశుధ్య కార్మికుల సేవలు మరువలేనివి

ఓర్వకల్లు, జూలై 16(ఆంధ్రజ్యోతి): ప్రతిరోజూ ఇంటి వద్దనే వ్యర్థాలను సేకరించి గ్రామాలను నందనవనంగా తీర్చిదిద్దుతున్న పారిశుధ్య కార్మికుల సేవలు మరువలేనివని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు సర్పంచ్ మోహన్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని గుట్టపాడు గ్రామంలో నమస్తే గ్రీన్ అంబాసిడర్ కార్యక్రమంలో భాగంగా గ్రీన్ అంబాసిడర్లకు పంచాయతీ కార్యాలయంలో పండ్లు పంపిణీ చేసి సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు మద్రికుంట కృష్ణారెడ్డి, చిన్న, పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే సహకార సంఘాల లక్ష్యం

కల్లూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల లక్ష్యమని నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి అన్నారు. బుధవారం ఉలిందకొండ సహకార సంఘం కార్యాలయంలో సంఘాల్లో పొదుపు, అకౌంట్ నమోదు చేసుకోవడం, అక్షరాస్యత అంశాలపై రైతులు, మహిళలకు అవగాహన నిర్వహించారు. డిస్ట్రిక్ కో-ఆపరేటివ్ ఆఫీసర్ వెంకటక్రిష్ణ, సీఈవో రామాంజనేయులు, లీడ్ బ్యాంక్ మేనేజర్ రామచంద్రారావు హాజరయ్యారు. కో-ఆపరేటివ్ సంఘాల గురించి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. బస్తిపాడు జడ్పీ స్కూల్ విద్యార్థులకు అతిథులు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉలిందకొండ సీఈవో హారీఫ్, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు

● రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్
● ఇందిరాగాంధీ నగర్‌లో 'తొలి అడుగు'

కర్నూలు అర్బన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం ఆర్థిక ఇబ్బందిలో ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం అభివృద్ధిని పరుగులు పెట్టిస్తోందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని ఇందిరాగాంధీ నగర్‌లో 'తొలి అడుగు' నిర్వహించారు. ఇంటింటికి తిరిగి అభివృద్ధి, సంక్షేమం గురించి అడిగి తెలుసుకున్నారు. 'తల్లికి వందనం' డబ్బులు తల్లుల అకౌంట్లలో జమ చేశామని, ఏడాదికి 3 ఉచిత సిలిండర్లు ఇస్తున్నామని అన్నారు. త్వర లోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం అమలు చేస్తామని తెలిపారు. సీఎం చంద్రబాబు నాయకత్వాన్ని ప్రజలందరూ మెచ్చుకుం టున్నారన్నారు.

కల్లూరు: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత అన్నారు. సుపరిపాలన తొలిఅడుగు కార్యక్ర మంలో భాగంగా బుధవారం ఆమె 29, 30 వార్డులు ఉద్యోగనగర్, శరీన్‌నగర్‌లో పర్యటించి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు ఇన్‌చార్జిలు శ్రీనివాసరావు, శైలజాయాదవ్, నాయకులు రాఘవేంద్ర, రామకృష్ణ, చంద్రమౌళీశ్వరరెడ్డి, సర్దార్, వీరేంద్రకుమార్, పుల్లయ్యగౌడ్, భాస్కర రెడ్డి, చిరంజీవి, ఎస్.ఫిరోజ్, జి.గంగాధర్ గౌడ్, మధు పాల్గొన్నారు.

కర్నూలు రూరల్: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. కర్నూలు మండలం పూడూరు గ్రామంలో బుధవారం నిర్వహించిన సుపరిపాలనతో తొలి అడుగు కార్యక్రమానికి ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పై అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ఎమ్మెల్యే ప్రజలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో సరదాగా ముచ్చటించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గాయర్లేపురం సీతారామిరెడ్డి, రామోజీరావు, రాజారెడ్డి, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు రామాంజనేయులు, పూడూరు బాషా, స్టాంటన్‌పురం క్లస్టర్ ఇన్‌చార్జి కుర్వ నాగమధు, బండారు పద్మ, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు ఆర్.సురేష్ పాల్గొన్నారు.

ఓర్వకల్లు: ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని సర్పంచ్ సుజాతమ్మ, నాయకులు చదువుల సుధాకర్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పాలకొలను గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ప్రభుత్వ సంక్షేమ పథ కాలు ప్రజలకు వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామ మద్దిలేటి, సత్యనారాయణ రాజు, అయ్యస్వామి, నాగరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గూడూరు: ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని పట్టణ టీడీపీ అధ్యక్షుడు కురుకుంద రామాంజనేయులు అన్నారు. బుధవారం గూడూరు పట్టణంలో సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ కౌన్సిలర్ ఎల్లయ్య, టీడీపీ నాయకులు నాగప్ప యాదవ్, చాంద్‌బాషా, సులేమాన్, అయ్యస్వామి పాల్గొన్నారు.


ఓర్వకల్లు మండలం పాలకొలనులో కరపత్రాన్ని అందిస్తున్న టీడీపీ నాయకుడు సుధాకర్ రెడ్డి


ఇందిరాగాంధీ నగర్‌లో కరపత్రాన్ని అందిస్తున్న మంత్రి టీజీ భరత్


ఉద్యోగనగర్‌లో కరపత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి


పూడూరులో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దస్తగిరి

సారా స్థావరాలపై దాడులు

ఆదోని, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివార్లలోని సారా స్థావరాలపై బుధవారం దాడులు చేసినట్లు ఎక్సైజ్ సీఐ సైదుల్లా తెలిపారు. వివరాల మేరకు.. కర్నూలు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ జయ రాంనాయుడు, రాజేంద్రప్రసాద్ సిబ్బందితో కలిసి ఆఫీసరాళ్ల కొండలు, సింగరాజుమల కొండలు, తాయమ్మబయలు కొండల్లో 1,050 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి, 47 లీటర్ల సారాను సీజ్ చేశారు. తయారీదారులు వాల్మీకినగర్‌కు చెందిన బోయ రఘు, బోయ మద్దిలేటి, బావాజీపేటకు చెందిన బోయ శివ, బోయ మునిపపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు



ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న టీడీపీ నాయకులు

తుగ్గలి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధితో పాటు ప్రజలకు సంక్షేమ పథకాలు సీఎం చంద్రబాబుకు రెండు కళ్లు లని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, సింగిల్ విండో అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం బొందిమడుగుల గ్రామంలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలు వివరించి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ చౌడప్ప, తిరుపాల్ నాయుడు, వెంకట్రాముడు, ప్రతాప్‌యాదవ్, మోహన్ ఉన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం



మాట్లాడుతున్న కేఈ హరిబాబు

మద్దికెర, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే సహకార సంఘం ధ్యేయమని మాజీ ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి తనయుడు కెఈ హరిబాబు అన్నారు. బుధవారం బురుజుల గ్రామంలో విశాల సహకార పరపతి సంఘం అధ్యక్షుడిగా ఎర్రిస్వామి బాధ్యతలు స్వీకరించారు. సంఘం పరిధిలో హోసూరు, మొలగవెల్లి, మొలగవెల్లికొట్టాల, బురుజుల ప్రాంతాల రైతులకు రుణాలు ఇస్తామన్నారు. ఎమ్మెల్యే శ్యాంబాబు సహకారంతో సహకార సంఘాన్ని బలోపేతం చేసుకోవాలని తెలిపారు. నాయకులు గూడూరు ధనుంజయుడు, శాంతిరెడ్డి పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని వృథా చేయొద్దు



మాట్లాడుతున్న సీడీపీవో మద్దమ్మ

దేవనకొండ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారాన్ని వృథా చేయవద్దని సీడీపీవో మద్దమ్మ కోరారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ లక్ష్మీదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండలంలోని 72 అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా లేదని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మురళిమోహన్‌ను సీడీపీవో ప్రశ్నించగా, నిధులు లేక పనులు పెండింగ్ ఉన్నాయని సమాధానమిచ్చారు. తహసీల్దార్ రామాంజనేయులు మాట్లాడుతూ ఉపాధి పథకంలో వందశాతం రాయితీ కింద పండ్ల తోటల పెంపకానికి రైతులు దరకాస్తు చేసుకోవాలన్నారు. డీలర్లు రేషన్ సక్రమంగా పంపిణీ చేయకపోతే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎంపీటీసీ సభ్యుడు తపాల శ్రీనివాసులు, ఎంఈవో తిమ్మారెడ్డి ఎంపీడీవో జ్యోతి, ఏవో ఉషారాణి, పశువైద్యాధికారి వెంకటేశ్వర్లు ఉన్నారు.

మెనూ పాటించాలి



విద్యార్థినులను పరీక్షిస్తున్న ఎంఈవో

వెల్దుర్తి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకంలో మెనూ పాటించాలని వంట ఏజెన్సీలను ఎంఈవో ఇందిర ఆదేశించారు. బుధవారం మండలంలో బోగోలు, గుంటుపల్లి మండల పరిషత్ పాఠశాలలను తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. పాఠాలకు సంబంధించిన ప్రశ్నలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

సింగిల్ విండో అధ్యక్షుడిగా రంగప్ప



బాధ్యతలు స్వీకరిస్తున్న రంగప్ప

పత్తికొండ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): సహకార పరపతి సంఘం అధ్యక్షుడిగా చందోలి రంగప్ప బుధవారం బాధ్యతలు స్వీకరించారు. టీడీపీ నాయకులు కేఈ హరిబాబు ఆధ్వర్యంలో సొసైటీ కార్యాలయంలో సంతకం చేశారు. డైరెక్టర్లుగా ఎరుకలచెరువు సురేంద్ర, పందికోన జగదీష్ బాధ్యతలు తీసుకున్నారు. సీఈవో ఏసు, వర్లశ్రీనివాసులు, చందోలి తిరుపాల్, రామానాయుడు, బత్తిని లోక్‌నాథ్ ఉన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

పత్తికొండటౌన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోతిరాళ్ల, పందికోన సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. బుధవారం తెలిపారు. ప్రజలు, రైతులు సహకరించాలన్నారు.

భగ్గుమన్న పచ్చిమిర్చి



- వారంలోనే కేజీ రూ.30 నుంచి రూ.80

మద్దికెర, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పచ్చి మిరప ధర అమాంతం పెరిగిపోవడంతో వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు. గత వారం కేజీ రూ.30లు మాత్రమే ఉన్న ధర నేడు ఆదివారం మార్కెట్‌లో కిలో రూ.80లు పలికింది. చిరు వ్యాపారులు రూ.100ల చొప్పున విక్రయిస్తున్నారు. తాము పండించే సమయంలో కిలో రూ.10 నుంచి రూ.20లకు మించేదికాదని, ఇప్పుడు పంట ఎక్కువగా లేకపోవడంతో ధర పెరిగిందని రైతులు ఆరోపిస్తున్నారు. అధికారులు ధరలు అదుపులో ఉండేలా చూడాలని వినియోగదారులు కోరుతున్నారు.

మధ్యవర్తిత్వంపై ర్యాలీ



ఆదోనిలో ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయాధికారి

ఆదోని, జూలై 16(ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వంపై అవగాహన ర్యాలీని లీగల్ సర్వీస్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. రెండో అదనపు జిల్లా న్యాయాధరికి, లీగల్ సర్వీస్ ఛైర్మన్ సుధ ప్రారంభించారు. మున్సిపల్ మైదానం నుంచి ర్యాలీని ప్రారంభించారు. రాజీ మార్గమే రాజమార్గమన్నారు. డీఎస్పీ హేమలత, ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు, సీనియర్ సివిల్ న్యాయాధికారులు యజ్ఞ నారాయణ, ఏపీఎస్ శ్రీవల్లి, న్యాయవాదులు లోకేష్‌కుమార్, ఆనంద్‌కుమార్, నగ్మా పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం



పత్తికొండ పట్టణంలో మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పత్తికొండ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ఆగస్టు 15 నుంచి ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని అమలు చేయనున్నట్లు ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. బుధవారం పట్టణంలోని కల్లుపెంటవీధి, కురువగేరిలో ప్రజలతో మాట్లాడారు. ప్రమోద్ కుమార్‌రెడ్డి, ఉచ్చీరప్ప, శ్రీనివాసులు, రంగన్న, మీరాహుసేన్, హుల్తెప్ప ఉన్నారు.

రికార్డ్ అసిస్టెంట్‌పై విచారణ



విచారణ చేస్తున్న అధికారి సురేష్ బాబు

హొళగుంద, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి విధులకు వస్తూ విద్యార్థుల తల్లిదండ్రలను దూషిస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న హొళగుంద ప్రభుత్వ జూనియర్ కళాశాల రికార్డు అసిస్టెంట్ శ్రీనివాసులును డీవీఈవో సి. సురేష్‌బాబు బుధవారం విచారించారు. పత్రికల్లో వార్తలు రావడంతో అధికారులు స్పందించారు. ప్రిన్సిపాల్ ప్రవీణ, విద్యార్థుల తల్లిదండ్రులు, సీడీపీ నాయకులతో సమావేశం అయ్యారు. మద్యం తాగి విధులకు హాజరవుతున్న శ్రీనివాసులుపై చర్యలు తీసుకోవాలని లిఖిత పూర్వకంగా ఫిర్యాద చేశారు. ప్రిన్సిపాల్ ప్రవీణను వివరణ కోరగా రికార్డ్ అసిస్టెంట్‌కు ఇప్పటికే షోకాజ్ నోటీసు ఇచ్చామని, శ్రీనివాసులు విచారణ నిమిత్తం కర్నూలుకు రావలసిందిగా అధికారులు సూచించినట్లు తెలిపారు.


విజిలెన్స్ అధికారుల తనిఖీలు



ఎరువుల దుకాణాల్లో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

హొళగుంద, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు అధికారులు సుదర్శరాజు వెంకటప్రసాద్, చెంగళరాయుడు, హొళగుంద ఏవో ఆనంద్ ఆధ్వరంలో ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. స్టాక్ బిల్లు పుస్తకాలు, దాస్త్రాలు, గోదాములను తనిఖీ చేశారు. స్టాక్, ఈపీవోఎస్ మధ్య వ్యత్యాసాల కారణంగా రెండు దుకాణంలోని 26 మెట్రిక్ టన్నుల ఎరువుల అమ్మకాలు నిలిపివేసినట్లు తెలిపారు. కాగా కొందరు దుకాణదారులు షాపులను మూసివేసి పరరయ్యారు.

కలిసికట్టుగా మార్కెట్ యార్డు అభివృద్ధి



మాట్లాడుతున్న మార్కెట్‌యార్డ్ ఛైర్మన్ నబీ రసూల్

పత్తికొండ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): యార్డును కలిసికట్టుగా అభివృద్ధి చేస్తామని పత్తికొండ మార్కెట్ యార్డు ఛైర్మన్ ఆలంకొండ నబీ అన్నారు. బుధవారం మార్కెట్ శాఖ జిల్లా అధికారి ఎ.నారాయణ మూర్తి, కార్యదర్శి కార్నలీస్‌తో కలసి డైరక్టర్లు, వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ప్రతి సోమవారం నిర్వహించే సంతతోపాటు కూరగాయల మార్కెట్, సీజన్‌లో జరిగే టమోటా మార్కెట్ ద్వారా ఆదాయం వస్తుందన్నారు. టమోటా ధరలు తగ్గుముఖం పట్టినప్పుడు రైతులకు ఇబ్బంది తలెత్తకుండా చూడాలని వ్యాపారులను కోరారు. డైరెక్టర్లు గోవర్ధన్, తుగ్గలిరంగ మాట్లాడుతూ వారపు సంత, మార్కెట్ నిర్వహణపై ప్రత్యేక విధానాన్ని రూపొందిస్తే మార్కెట్‌కు మరింత ఆదాయం సమకూరే అవకాశం ఉందన్నారు.

ఉచిత ఇసుకపై దుమారం..

హాలహర్వి, జూలై 16(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ఇసుక ఉచితమని చెబుతున్నారని మరి ట్రాక్టర్లను ఎందుకు సీజ్ చేస్తున్నారంటూ జెడ్పీటీసీ లింగప్ప మండిపడ్డారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నెట్టికంటమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. హౌసింగ్ పనులకు ఇసుక తరలించేందుకు వెళితే పోలీసులు ట్రాక్టర్లను సీజ్ చేస్తున్నాడనతంతో హౌసింగ్ ఏఈ అనీరుద్‌బాబు మాట్లాడుతూ తమ అనుమతులు చాలవని పోలీసులు సమాధానం చెబుతున్నారని సమధానం ఇచ్చారు. మండల జేఏఈ సోమప్ప మాట్లాడుతూ ప్రభుత్వ పనుల కోసం తీసుకొచ్చే ఇసుక ట్రాక్టర్‌ను ఆపే అధికారం పోలీసులకు లదేని, ఇందుకు జీవో ఉందన్నారు. కార్యదర్శుల అనుమతితో తరలించవచ్చన్నారు. అయితే ఇసుకపై ఏదో ఒకటి తేల్చాలని సర్పంచ్ మల్లికార్జున పట్టుబట్టారు. చివరకు తహసీల్దార్ లక్ష్మీనారాయణ జోక్యం చేసుకుని అభివృద్ధి పనుల కోసం ఇసుక రవాణా చేస్తే తమకు అభ్యంతరం లేదని, ఆర్డర్ ఉంటే చాలని సమాధానం చెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

పండ్ల తోటలు సాగు చేసుకోండి

మద్దికెర, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రైతులు పండ్ల తోటలు సాగు చేసుకోవాలని ఏపీవో నర్సిరెడ్డి సూచించారు. బుధవారం ఉపాధి కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. తమకు కావలసిన పండ్ల మొక్కలను రైతులే కొనుగోలు చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. పండ్ల తోటలు, గడ్డి, పూలతోటల పెంపకానికి అవకాశం ఉందన్నారు. ఉపాధి టీఏలు, ఎఫ్‌ఏలు రైతుల నుంచి వివరాలు సేకరించి పండ్ల తోటల సాగు చేసే విధంగా చూడాలన్నారు.

నిధులు కేటాయించాలి



మంత్రి లోకేశ్‌తో మీనాక్షినాయుడు

ఆదోని, జూలై 16 (ఆంధ్రజ్యోతి): నియోజ కవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిం చాలని మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు మంత్రి లోకేశ్‌ను కోరారు. బుధవారం ఉండవల్లిలో మంత్రిని కలిసి పలు సమస్యలపై చర్చించారు. బసాపురం గ్రామంలో ఇంటి పట్టాల సమస్య పరిష్కరించాలని, ఆరేకల్లు సమీపంలో బాలికల ఉర్దూ జూనియర్ కళాశాల, ఐటీఐ మైనార్టీ కళాశాలకు ఫర్నీచర్, టీచింగ్, నాన్‌టీచింగ్ స్టాఫ్‌ను ఏర్పాటు చేయాలన్నారు. అలాగే బసాపురం ఎస్ఎస్ ట్యాంకు మరమ్మతులు చేయించాలని విన్న వించారు. స్పందించిన మంత్రి పరిష్కరి స్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

తోటలతో లాభాలు

ఆలూరు రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పండ్ల తోటల సాగుతో లాభాలు వస్తాయని డ్వామా పీడీ వెంకటరమణయ్య సూచించారు. బుధవారం నర్సరీలో మొక్కలను పరిశీలించారు. ఐదు ఎకరాల్లోపు ఉన్న రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహం వస్తుందని మామిడి, జామ, సపోట తదితర మొక్కలు అందిస్తామ న్నారు. ఏపీడీ పక్కీరప్ప, పురుషోత్తంరెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రజా పంపిణీని గాడిలో పెడతా

- తహసీల్దార్ శోభా సువర్ణమ్మ

ఆలూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి):



ప్రజా పంపిణీ వ్యవస్థను గాడిలో పెడతామని తహసీల్దార్ శోభా సువర్ణమ్మ తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ డీలర్లు షాపులను ప్రభుత్వం నిర్దేశించిన సమయాల్లో తెరిచి ఉంచాలన్నారు. తాను తనిఖీ చేస్తానని, నిబంధనలు పాటించని డీలర్లపై వేటు తప్పదని హెచ్చరించారు. వీఆర్వోలు గ్రామాల్లో అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించాలన్నారు.

ఆలయంలో దొంగతనం

చిప్పగిరి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక గోవిందప్ప స్వామి ఆలయంలో మంగళవారం రాత్రి దొంగతనం జరిగింది. కిలో వెండి ఆభరణాలు, హుండీని దొంగలు ఎత్తుకెళ్లినట్లు నిర్వాహకులు తెలిపారు. సంఘటన స్థలాన్ని ఎస్ఐ ఏపీ శ్రీనివాసులు బుధవారం పరిశీలించారు. సీసీ కెమెరాలను పరిశీలించి, ఫింగర్ ప్రింట్స్ సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

పగిడిరాయిలో భారీ వర్షం

- పొంగిన వాగులు, వంకలు.. నిలిచిన వాహనాల రాకపోకలు



సూచనలు చేస్తున్న జొన్నగిరి ఎస్ఐ మల్లికార్జున

తుగ్గలి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పగిడిరాయి గ్రామంలో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. జడ్పీ పాఠశాల వద్ద ఉన్న వంక, వాగులు పొంగిపొర్లాయి. అసాయంత్రం చెన్నంపల్లి గ్రామంలో కూడా వర్షం కురిసింది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. జొన్నగిరి ఎస్ఐ మల్లికార్జున, సిబ్బంది, రెవెన్యూ అధికారులు ప్రజలను అప్రమత్తం చేశారు. వేగంగా ప్రవహిస్తున్న వాగును దాటద్దని హెచ్చరికలు జారీ చేశారు.

యూరియా కొరత లేకుండా చూడాలి



ఏవోకు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

దేవనకొండ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులకు యూరియా కొరత రాకుండా చుడాలని బీజేపీ నాయకులు బొల్లేద్దుల కిరణ్, వీరయ్య అన్నారు. బుధవారం ఏవో ఉషారాణికి వినతిపత్రం ఇచ్చారు. గతంలో మాదిరిగా రైతు సేవా కేంద్రాల్లోనే యూరియాను అందుబాటులో ఉంచాలన్నారు. నెల రోజులుగా యూరియా దొరక్క రైతులు పొలం పనులు మాని తిరుగుతుఆన్నరని ఆవేదన వ్యక్తం చేశారు.

పనిచేసిన వారికే పదవులు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బీటీ నాయుడు

హాలహర్వి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం పనిచేసిన వారికే పదవులు వస్తాయని ఎమ్మెల్సీ బీటీ నాయుడు అన్నారు. బుధవారం గూళ్యం గ్రామంలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ టీడీపీ క్రమశిక్షణ కలిగిన పార్టీ అని, పనిచేసే కార్యకర్తకు గుర్తింపు ఉంటుందన్నారు. కృష్ణమనాయుడు, ప్రహ్లాదరెడ్డి, రఘుప్రసాద్ రెడ్డి, కన్వీనర్ సుధాకర్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మించండి



కలెక్టర్‌కు బొకే ఇస్తున్న టీడీపీ నాయకులు

చిప్పగిరి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో సీసీ రోడ్డు నిర్మాణా నికి రూ.40లక్షలు కేటాయించాలని కలెక్టర్ రంజిత్ బాషాను జడ్పీటీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు మీనాక్షి నాయుడు, ఎంపీటీసీ రజిని, కోరారు. తెలిపారు. బుధవారం కర్నూలులో కలెక్టర్‌కు సమస్యలపై వినతిపత్రం అందించారు. చిప్పగిరి నుంచి ఏరూరు మధ్య ఆలూరు ఉప కాలువపైవంతెన మరమ్మత్తుకు రూ. 3లక్షలు మంజూరు చేశాలన్నారు. స్పందించిన కలెక్టర్ యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తులు పూర్తి చేయాలని ఇంజనీర్‌ను కలెక్టర్ ఆదేశించారు.

రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు

హాలహర్వి, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నుంచి నిట్రవట్టి గ్రామాని రోడ్డు, వంతెన నిర్మాణానికి కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపుతామని డ్వామా పీడీ వెంకటరమణ అన్నారు. బుధవారం మండలంలోని నిట్రవట్టి గ్రామంలో ప్రజలతో మాట్లాడారు. ఉపాధి నిధులతో రహదారిని నిర్మించే అవకాశముందని, కూలీలు పనులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. త్వరలో వేతనాలు కూలీల ఖాతాల్లో జమ చేస్తామన్నారు.

చెత్త సేకరించకుంటే ఫిర్యాదు చేయండి



ప్రజలతో మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్, కమిషనర్

ఆదోని టౌన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికులు చెత్తను సరిగా సేకరించకుంటే తమకు ఫిర్యాదు చేయాలని మునిసిపల్ ఛైర్‌పర్సన్ లోకేశ్వరి, కమిషనర్ కృష్ణ ప్రజలకు సూచించారు. బుధవారం పట్టణంలోని ఫరీద్ సాబ్ వీధిలో పారిశుధ్య పనులను పరిశీలించారు. వార్డు ప్రజలను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. చిన్న సందులు ఉండటంతో చిన్న తోపుడు బండ్లతో చెత్తను సేకరించాలని చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

గ్రామాభివృద్ధే ధ్యేయం



ప్రజలతో మాట్లాడుతున్న ఉమాపతినాయుడు

ఆదోని, జూలై16(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని కురువ కార్పొరేషన్ ఛైర్మన్ దేవేంద్రప్ప, టీడీపీ నాయకుడు ఉమాపతినాయుడు అన్నారు. బుధవారం మండలంలోని చిన్నపెండేకల్లులో ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. గ్రామంలో తాగునీరు అందడం లేదని ప్రజలు విన్నవించారు. స్పందించిన నాయకులు అధికారులకు ఫోన్ చేసి పరిష్కరించాలని సూచించారు. రెండు రోజుల్లో గ్రామానికి నీరు రాకుంటే సొంత నిధులతో తాగునీరు అందిస్తామని ఉమాపతినాయుడు హామీ ఇచ్చారు. శ్రీకాంత్‌రెడ్డి, రంగస్వామినాయుడు, చాగి మల్లికార్జునరెడ్డి, నీలకంఠప్ప, వెంకటేష్‌చౌదరి పాల్గొన్నారు.

ఎరువులు వచ్చేశాయ్..

- 750 మెట్రిక్ టన్నులు సిద్ధం : ఏవో

ఆదోని అగ్రికల్చర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన యూరియా, రసాయనిక ఎరువులు బుధవారం రైల్వే వ్యాగన్ ద్వారా వచ్చినట్లు వ్యవసాయాధికారి సుధాకర్ తెలిపారు. బుధవారం డీసీఎంఎస్ కేంద్రానికి, ఆర్ఎస్‌కేకు కేటాయించిన యూరియా స్టాక్‌ను పరిశీలించారు. ఆదోని, ఆలూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు నియోజక వర్గాలకు కేటాయించిన 705 మెట్రిక్ టన్నుల యూరియా ఆదోని రైల్వే గూడ్స్ షెడ్‌కు చేరుకున్నాయని అన్నారు. ఇక్కడి నుంచి డీలర్లు, డీసీఎంఎస్, ఆర్ఎస్‌కేలకు సరఫరా అవుతుందని తెలిపారు. ఒక్కో రైతుకు ఐదు బస్తాలకు మించి యూరియా ఇవ్వద్దని డీలర్లకు సూచించామని పేర్కొన్నారు. రైతులకు తమ కార్యాలయం నుంచే పర్మిట్లను రాసి ఇస్తున్నట్లు తెలిపారు. ఏఈవో సతీష్, డీసీఎంఎస్ మేనేజర్ ప్రకాష్ రెడ్డి ఉన్నారు.

హామీలను విస్మరించిన ప్రభుత్వం



వెల్దుర్తిలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి

వెల్దుర్తి టౌన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం విస్మరించిందని పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఆరోపిం చారు. బుధవారం వెల్దుర్తిలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ, వైసీపీ విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహిం చారు. ప్రజలు తిరుగుబాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి ఎన్నికల మేనిఫెస్టోను చూపించాలన్నారు. చంద్రబాబు మోసాలను ఇంటింటికి తీసుకెళ్లి ఎండగడతామన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో అక్రమ కేసులు బనాయిస్తే బెదిరేది లేదన్నారు. చెరుకులపాడు ప్రదీప్‌రెడ్డి, కన్వీనర్ రవిరెడ్డి, జడ్పీటీసీ సుంకన్న, సర్పరాజాపురం వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ ముత్యాల శైలజ పాల్గొన్నారు.

తుగ్గలి: వైసీపీ విస్తృతస్థాయి సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పాల్గొన్నారు. శ్రీనివాసరెడ్డి, మోహన్ రెడ్డి, జిట్ట నగేష్ ఉన్నారు.

ఎన్నికల విధుల్లో బీఎల్‌వోల పాత్ర కీలకం



బీఎల్‌వోలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న అధికారులు

గోనెగండ్ల, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధుల్లో బీఎల్‌వోల పాత్ర కీలకమని డిప్యూటీ తహసీల్దార్ రఘువీర, ఎన్నికల ఉప తహసీల్దార్ వలిబాషా అన్నారు. బుధవారం ఎంపీడీవో సమావేశ భవనంలో బీఏ ల్‌వోలకు చివరి రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. శిక్షణకు హాజరైన వారికి సర్టిఫికెట్లు అందజేశారు.

కేంద్ర పథకాలపై కరపత్రాల పంపిణీ



కరపత్రాలను పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): కేంద్ర పథకాల గురించి పార్టీ నాయకులు ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. బుధవారం బీజేపీ అసెంబ్లీ కో కన్వీనర్ తోగట నరసింహులు, ఎమ్మిగనూరు మండల అధ్యక్షుడు వెంకటేష్ మాట్లాడారు. అటల్ పెన్షన్ యో జన, ఆయుష్మాన్ భారత్ యోజన, ప్రధాన మంత్రి మాతృ వందనం తదితర పథకాల గురించి ప్రజలకు తెలియజేశారు కార్యక్రమంలో గుమ్మ ల నర్సప్ప, మండల ప్రధాన కార్యదర్శి బడేసాబ్, ఏసేపు, రమేష్ పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన సదస్సు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ జాహ్నవి

ఎమ్మిగనూరు టౌన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): స్థానిక 16వ వార్డులో కౌన్సిలర్ అబ్దుల్ వహిద్ అధ్యక్షతన క్షయ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈకార్యక్రమానికి డాక్టర్ జాహ్నవి హాజరై మాట్లాడారు. రెండు నెలలకు మించి జ్వరం, దగ్గు ఉంటే క్షయ వ్యాధి పరీక్షలు చేయించుకోవాలని ప్రజలకు సూచించారు. గళ్లలు రావడం, బరువు తగ్గడం, ఆకలి మందగించడం లాంటి క్షణాలను ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుమలత, ఏ ఎన్ఎం రాజేశ్వరి, ఆశ పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో పొగతాగడం నిషేధం



వైఎస్ఆర్ సర్కిల్‌లో పొగతాగిన వారికి జరిమానా విధిస్తున్న ఎస్ఐ మధుసూదన్ రెడ్డి

ఎమ్మిగనూరు టౌన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాలలో పొగతాగడం, గుట్కాలు నమలడం నిషేధమని పట్టణ ఎస్ఐ మదుసూదన్ రెడ్డి తెలిపారు. స్థానిక వైఎస్ఆర్ సర్కిల్‌లో పొగ తాగుతూ, గుట్కా నమి లిన ఏడుగురిని గుర్తించి ఒక్కొక్కరికి రూ.200 చొప్పున జరిమానా విధిం చారు. కార్యక్రమంలో పీసీలు బీరప్ప, నవాజ్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం



మాట్లాడుతున్న పెద్దమరివీడు టీడీపీ నాయకులు

గోనెగండ్ల, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దమరివీడు గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారమైనట్లు టీడీపీ నాయకులు ప్రభుదాస్, నాగరాజు, గోపాల్, లోకేష్ తెలిపారు. బుధవారం వారు మాట్లా డుతూ గతంలో ఐదు రోజులకు ఒక్కసారి కొళాయిలు తాగునీరు విడుదల అయ్యేది, దీంతో గ్రామస్థులు ఇబ్బందిపడేవారని ఈ విషయాన్ని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన ప్రత్యేక పైప్‌లైన్ వేయించి తాగునీటి సమస్యను పరిష్కరించారని వారు తెలిపారు. కార్యక్ర మంలో లక్ష్మి, రజియాబేగం, రాముడు, చంద్రన్ననాయుడు, లక్ష్మన్న రవి, ఏసేపు పాల్గొన్నారు.

'నమస్తే'తో పారిశుధ్య కార్మికులకు గుర్తింపు



గోనెగండ్లలో పారిశుధ్య కార్మికులను పూలమాలలతో సన్మానిస్తున్న అధికారులు

గోనెగండ్ల, జూలై 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నమస్తే పథకం (నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజేడ్ శానిటేషన్ ఎకోసిస్టమ్) ద్వారా పారిశుధ్య కార్మికులకు మంచి గుర్తింపు లభిస్తుందని ఎంపీడీవో మణి మంజరి, ఈవోఆర్‌డీ ఆనంతశయన, కార్యదర్శి సతీశ్, గ్రామ సర్పంచ్ హైమావతి అన్నారు. బుధవారం మండల కేంద్రమైన గోనెగండ్లలో పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికులను పూలమాలలతో అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో మలాంగ్, సుభాన్, అనిల్ పాల్గొన్నారు.



మా ఊరుకి ఎలా వెళ్లాలి?

- కోసిగి ఆర్టీసీ బస్టాండులో విద్యార్థుల నిరసన
- చిన్నభోంపల్లి, పెద్దభోంపల్లి బస్సు రద్దు



కోసిగి ఆర్టీసీ బస్టాండులో బస్సు రద్దు కావడంతో ఆవేదన చెందుతున్న చిన్నభోంపల్లి, పెద్దభోంపల్లి విద్యార్థులు

కోసిగి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సును రద్దు చేస్తే తమ ఊరుకి ఎలా వెళ్లాలని పలువురు విద్యార్థులు ప్రశ్నించారు. కోసిగి ఆర్టీసీ బస్టాండులో చిన్నభోంపల్లి, పెద్ద భోంపల్లి, డీ.బెళగల్ గ్రామాలకు చెందిన సుమారు 80 మంది విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక్కసారిగా బస్సు రద్దు చేస్తే తాము ఊరికి ఎల్లా వెళ్లాలని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం తమ ఊర్లకు ఆటో సౌకర్యం కూడా లేదని వాపోయారు. ఈ విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' ఆదోని ఆర్టీసీ డీఎం రఫీక్‌ను వివరణ కోరగా.. బస్సు వేయడానికి కూడా నన్నే అడుగుతారా.. కంట్రోలర్‌ను అడగండి.. నాకేం సంబంధమని అసహనం వ్యక్తం చేశారు. కంట్రోలర్‌కు ఫోన్ చేయగా రిసీవ్ చేసుకోలేదు.



గోనెగండ్ల మండలం అలువాలలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి



సాతనూరులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి

టీడీపీతోనే గ్రామాభివృద్ధి: ఎమ్మెల్యే

గోనెగండ్ల, జూలై 16(ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని అలువాల, చిన్నమరివీడు గ్రామాలలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకు ముందు అలువాల గ్రామంలో టీడీ పీ కార్యాలయాన్ని బీవీ ప్రారంభించారు. అలాగే చిన్నమరివీడు గ్రామంలో తాగునీటి పథకం నుంచి కొళాయిలకు నీటిని విడుదల చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంతో గ్రామాల అభివృద్ధి కుంటుపడిందన్నారు. ఎంవీఎస్ స్కీం కింద రూ. 19.5 కోట్లతో 14 గ్రామాలకు తాగునీటి పథకాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తిరుపతయ్యనాయుడు, మల్లయ్య, బేతాల బడేసా, తిమ్మారెడ్డి, రాజేష్, చిన్ననేలటూరు నాగన్న, రహంతుల్లా, చంద్ర శేఖర్, బాషా, నూర్ పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు

కోసిగి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికీ పథకాలను అందిస్తుందని మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని సాతనూరు గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలను వివరించారు. సూపర్ సిక్స్ పథకాల హామీల్లో భాగంగా కూటమి ప్రభుత్వం వచ్చే నెల ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పల్లెపాడు రామిరెడ్డి, ఆర్లబండ సహకార సంఘం చైర్మన్ నాడిగేని అయ్యన్న, టీడీపీ మండల కన్వీనర్ జ్ఞానేష్, మాజీ జడ్పీటీసీ తోవి రామకృష్ణ, వక్రాణి వెంకటేశ్, నాడిగేని చిన్న తాయన్న, కోసిగయ్య, చింతలగేని నర్సారెడ్డి, బీటీ నాగేంద్ర, రామిరెడ్డి, వెంకటేశ్, నజీర్, ముదుకప్ప, రాజు, రణతి కృన్న, అంజిరెడ్డి, రంగారెడ్డి, ఈరయ్య, శివ, సొట్టయ్య, తదితరులున్నారు.

ప్రతి ఎకరాకు సాగునీరు

ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని పులికనుమ, మూగలదొడ్డి గ్రామాల పరిధిలోని పంప్ హౌస్‌ల ద్వారా నీరు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ పంప్ హౌస్‌ల పరిధిలో 3,793 ఎకరాల రైతులకు సాగునీరు అందుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ సాగునీటి సంఘం అధ్యక్షులు పల్లెపాడు రామిరెడ్డి, ఆర్లబండ సహకార సంఘం చైర్మన్ నాడిగేని అయ్యన్న, ఇరిగేషన్ ఏఈ ప్రేమ్ కుమార్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పెద్దకడబూరు: కూటమి ప్రభుత్వ పాలనలో రాజకీయలకు అతీతంగా అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని టీడీపీ రాష్ట్ర యువనాయకులు రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని నాగలాపురం గ్రామంలోని సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర రైతు సంఘం అధికార ప్రతినిధి రమాకాంత్ రెడ్డి, టీడీపి మండల కన్వీనర్ బసలదొడ్డి ఈరన్న, నాయకులు నరసప్ప, గోపాల్ రెడ్డి, హనుమయ్య, పెద్దఈరన్న, వీరేష్, బొగ్గుల నరసన్న, బొగ్గుల తిక్కన్న, నర్సిరెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం

మంత్రాలయం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలోని రాఘవేంద్రపురంలో మిడిగలదిన్నె భీమయ్య చెందిన గడ్డివామి దగ్ధమైంది. బుధవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తులు గడ్డివాముకు నిప్పు పెట్టారు. దీంతో పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. చుట్టుపక్కల వారు స్పందించి మంటలను అదుపులోకి తెచ్చారు. గడ్డివాము విలువ దాదాపు రూ.లక్ష వరకు ఉంటుందని రైతు భీమయ్య వాపోయారు. ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరారు.

నిబంధనలను ఉల్లంఘించిన పాఠశాలలను సీజ్ చేయాలి




ఎంఈవోలకు వినతి పత్రం ఇస్తున్న ఆర్‌వీఎఫ్ నాయకులు

మంత్రాలయం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలో ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి విద్యను వ్యాపారంగా మార్చిన ప్రైవేటు పాఠశాలలను వెంటనే సీజ్ చేయాలని రాయలసీమ అభ్యుదయ విద్యార్థి ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఖాజా, కృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం ఎంఆర్‌సీ భవన్‌లో ఎంఈవోలు మైనుద్దీన్, రాగన్నలు కలిసి ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల్లోనే బుక్స్, బ్యాగ్, షూస్ విక్రయిస్తూ వ్యాపార కేంద్రంగా మార్చారని ఆరోపించారు. ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోకపోతే ఆర్‌వీఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు వినోద్, మోహన్ పాల్గొన్నారు.

ప్రతి రైతుకు యూరియా అందజేస్తాం

ఎమ్మిగనూరు రూరల్, జూలై 16(ఆంధ్రజ్యోతి): ప్రతి రైతుకు యూరియాను అందజేస్తామని టీడీపీ మండల కన్వీనర్ కె.టి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండలంలోని కె.తిమ్మాపురం గ్రామంలో టీడీపీ మండల కన్వీనర్ కె.టి వెంకటేశ్వర్లు, గ్రామ టీడీపీ అధ్యక్షులు రంగన్నలు రైతులకు యూరియా బస్తాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల యూరియా కష్టాలను దృష్టిలో ఉంచుకొని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడి యూరియాను తెప్పించారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు తాగునీటి కష్టాలు



పాఠశాలలో కొళాయిల వద్ద గుమికూడిన బాలికలు

గోనెగండ్ల, జూలై 16(ఆంధ్ర జ్యోతి): గోనెగండ్ల జడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు రోజురోజకు తాగునీటి కష్టాలు తీవ్రమవుతున్నాయి. మధ్యాహ్న భోజన సమయంలో సరిపడ తాగునీటి కొళాయిలు లేక పోవ డంతో భోజనం చేసిన విద్యార్థులు దాహంతో పాఠశాల ఆరుబయట ఏర్పా టు చేసిన నీటి ట్యాంక్‌ను ఆశ్రయిస్తున్నారు. పాఠశాల నుంచి ఎమ్మిగనూరు, కర్నూలు ప్రధాన రహదారి దాటి ఆరుబయటకు తాగునీటి కోసం విద్యార్థులు వస్తున్నారు. దాహర్తి సమయంలో ఆతృతతో రోడ్డు దాటే సమయంలో ఏదేని ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు లేక పోలేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఈ విషయంపై పాఠశాల హెచ్ఎం నాగభూషణం మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల కోసం కొళాయిలు ఏర్పాటు చేశామని, సరిపోకపోతే మరిన్ని కొళాయిలు ఏర్పాటు చేస్తామని చెప్పారు.

కూటమి ప్రభుత్వంతోనే రైతులకు న్యాయం



బూదూరు పంప్‌హౌస్‌ను స్విచ్ ఆన్ చేసి నీటిని వదులుతున్న టీడీపీ సీనియర్ నాయకులు రఘునాథరెడ్డి

మంత్రాలయం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రైతులకు కూటమి ప్రభుత్వంతోనే న్యాయం జరుగుతుందని టీడీపీ సీనియర్ నాయకులు రఘునాథరెడ్డి అన్నారు. బుధవారం మంత్రాలయం మండలంలోని బూదూరు పంప్‌హౌస్ నుంచి సాగునీటిని విడుదల చేశారు. అంతకుముందు రఘునాథరెడ్డికి శాలువ, పూలమాలతో ఘనంగా రైతులు సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు లక్ష్మీకాంత్, అబ్రహం, మోషే, దాసు, భూషణం, శాంతిరాజు, గుర్మింటి భీమిరెడ్డి, రోగెప్ప పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

కౌతాళం, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండలంలో ఎవరైన అనుమానిత కొత్త వ్యక్తుల కనిపిస్తే అలాంటి వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కౌతాళం సీఐ అశోక్‌కుమార్ సూచించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో చాలా గ్రామాల్లో ప్రజలు వ్యవసాయ పనులకు వెళ్తున్నారని, దాంతో కొత్త వ్యక్తులు సంచరిస్తూ దొంగతనాలకు పాల్పడుతున్నారన్నారు. విలువైన డబ్బు, బంగారు, వెండి వస్తువులకు ఇళ్లలో ఉంచకుండా బ్యాంకుల్లో దాచుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఎవరైన అనుమానిత కొత్త వ్యక్తులు కనిపిస్తే వారి ఫొటోలను తీసి పోలీసులకు సమాచారం అందించాలన్నారు. గ్రామాల్లో ఇప్పటికే గట్టి పోలీసు నిఘా ఉంచామని తెలిపారు.

తప్పులు లేని ఓటరు జాబితాను సిద్ధం చేయండి

కౌతాళం, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండలంలో తప్పులు లేని ఓటరు జాబితాను సిద్ధం చేయాలని ఎన్నికల మంత్రాలయం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి అనురాధ తెలిపారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో బూత్ లెవెన్ ఆఫీసర్ల శిక్షణ కార్యక్రమం తహసీల్దార్ రజనీకాంత్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. మండలంలో 18 సంవత్సరాలు పూర్తయిన యువతి, యువకులు తమ పేర్లను ఓటరు జాబితాలో చేర్చాలన్నారు. అలాగే మరణించిన వారి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించాలన్నారు. సమావేశంలో మండల బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

దండోదక స్నానం ఆచరించిన పీఠాధిపతి

- దక్షిణాయన పుణ్యకాలం ప్రారంభం



తుంగభద్ర నదిలో దండోదక స్నానంలో పండితులకు సంప్రోక్షణం చేస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం, జూలై 16(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు తుంగభద్ర నదిలో దండకం చేతపట్టి స్నానం ఆచరించారు. బుధవారం దక్షిణాయన పర్వ పుణ్యకాలం ప్రారంభంలో భాగంగా మధ్యాహ్నం తన శిష్యబృందం, పండితులు, శ్రీమఠం ఉద్యోగులు, సంస్కృత పాఠశాల అధ్యాపకులు, భక్తులతో కలసి వేదపండితుల మంత్రోచ్ఛారణాలు మధ్య దండోదక స్నానం ఆచరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ముగతిలో మెడికల్ క్యాంప్‌లు



మెడికల్ క్యాంప్‌లో ఆనందమ్మ ఆసుపత్రి పత్రాలను పరిశీలిస్తున్న జిల్లా అధికారులు

నందవరం, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముగతి గ్రామంలో బుధవారం జిల్లా వైద్య బృందం మెడికల్ క్యాంప్‌లు నిర్వహించారు. గ్రామంలో ఆనందమ్మ డెంగీ వ్యాధి లక్షణాలతో మృతి చెందిందనే వార్తపై గ్రామానికి జిల్లా ఇమ్యూనేషన్ అధికారి డాక్టర్ నాగప్రసాద్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రఘురామిరెడ్డి, డాక్టర్లు శ్రీలేఖ, వేణుగోపాల్ ఇంటింటికి తిరిగి పర్యవేక్షిస్తూ ఇక్కడే వారం రోజుల పాటు మెడికల్ క్యాంప్ లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మలేరియా, విషజ్వరాలకు వ్యతిరేకంగా గ్రామంలో ఫాగింగ్, అబేట్, పైరిత్రమ్ మందును పిచికారి చేశామని తెలి పారు. అనంతరం ఆనందమ్మ భర్త ముగతి సర్పంచ్ విరుపాక్షిరెడ్డి ఇంటికి వెళ్లి ఆయనతో మాట్లాడి, ఆసుపత్రిలో ట్రీట్ మెంట్ చేసిన పత్రాలను పరి శీలించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో బలరామ్, సూపర్‌వైజర్ శ్రీనివాసులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ముగతిలో 'పొలం పిలుస్తోంది'



ముగతిలో 'పొలం పిలుస్తోంది'లో పాల్గొన్న ఏవో సరిత

నందవరం, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముగతి గ్రామంలో బుధవారం వ్యవసాయ అధికారి సరిత ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ రైతులు పత్తి పొలాల్లో తొలి దశలో వచ్చే రసం పీల్చే పురుగులు, వేరుకుళ్లు, వడ, ఆకు పచ్చ తెగుళ్ల వంటి లక్షణాల గురించి రైతులకు వివరించారు. వాటి నివారణ, సస్య రక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ కమిటీ అధ్య క్షుడు, గుగ్గిరి నరసింహులు, కడుబూరి, మాజీ ఉప సర్పంచ్ తాయన్న యాదవ్, నరసన్న, నాగేంద్ర, సోమేష్ పాల్గొన్నారు.

రాజీతోనే కేసుల పరిష్కారం



వైఎస్ఆర్ సర్కిల్‌లో ర్యాలీలో చేస్తున్న న్యాయవాదులు

ఎమ్మిగనూరు టౌన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): కోర్టులో దీర్ఘకాలికంగా ఉన్న పెండింగ్ కేసులను రాజీ మార్గంతోనే పరిష్కరించుకోవాలని ఎమ్మిగనూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రషీద్ తెలిపారు. బుధవారం ఎమ్మిగనూరు కోర్టు నుంచి వైఎస్ఆర్ సర్కిల్ వరకు 1కే ర్యాలీలో నిర్వహిం చారు. ఈసందర్భంగా రషీద్ మాట్లాడుతూ మధ్యవర్తిత్వపు లాయర్ల ద్వారా దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఆనంద్, రామకృష్ణ, మురళీకృష్ణ, తిమ్మప్ప, శీను, రఘురామ్ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ తనిఖీలు



మంత్రాలయం మండలం మాధవరంలో ఎరువుల దుకాణాలను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

మంత్రాలయం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని మాధవరం, మంత్రాలయంలో ఎరువుల దుకాణాలను విజిలెన్స్ అధికారులు రమేష్‌బాబు, నారాయణప్ప, ఏడీఏ మహమద్ ఖాద్రిలు బుధవారం తనిఖీలు చేశారు. మాధవరంలో పాండురంగ ట్రేడర్స్‌లో రికార్డుల్లో వ్యత్యాసం ఉన్న 660 బస్తాల ఎరువులను సీజ్ చేశారు. దాదాపు వీటి విలువ రూ.8.92 లక్షలు విలువ ఉంటుందన్నారు. రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే అటువంటి దుకాణాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో మండల వ్యవసాయాధికారి జీర గణేష్, వెంకటేశ్, చంద్రన్న గౌడు తదితరులు పాల్గొన్నారు.

యూరియా పంపిణీ



రైతులకు యూరియా పంపిణీ చేస్తున్న తెలుగు రైతు అధికార ప్రతినిధి రమాకాంత్ రెడ్డి

పెద్దకడబూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రైతులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని టీడీపీ రాష్ట్ర రైతు సంఘం అధికార ప్రతినిధి రమాకాంత్ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సొసైటీ ఆవరణంలో చైర్మన్ మీసేవ ఆంజినేయులు ఆధ్వర్యంలో యూరియా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏవో సుచరిత, టీడీపి నాయకులు మల్లికార్జున, యంజీ నరసన్న, రంగస్వామి, రైతులు పాల్గొన్నారు.

మా పిల్లలను వేరే పాఠశాలకు బదిలీ చేస్తే ఒప్పుకోము



మంత్రాలయంలో పాఠశాల ముందు విద్యార్థులతో ధర్నా చేస్తున్న తల్లిదండ్రులు

మంత్రాలయం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రామచంద్రనగర్‌లోని ప్రాథమిక పాఠశాలలో ఉన్న 3, 4, 5 తరగతులను అరకిలోమీటరు దూరంలో ఉన్న సంత మార్కెట్‌లోని ప్రాథమిక పాఠశాలకు బదిలీ చేయడం ఒప్పుకునేది లేదని తల్లిదండ్రులు స్పష్టం చేశారు. బుధవారం విద్యార్థులతో సహా తల్లిదండ్రులు కలిసి ధర్నా చేశారు. అధికారులు, పాలకులు స్పందించి యథావిధిగా పాఠశాలలో తరగతులు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు అనిల్, తల్లిదండ్రులు శాంతి, శకుంతలమ్మ, సునీల్ కుమార్, ఎంఎం వీరన్న పాల్గొన్నారు.